teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

## హ్యాపీ సంక్రాంతి



సంక్రాంతి పండుగ సందర్భంగా మన పత్రిక కార్యాలయానికి సెలవు. శుక్రవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.

- ఎడిటర్



ములుగు | సంపుటి : 04 | సంచిక : 198 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 15 జనవరి 2026 | పేజీలు : 08 | వెల ‘5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.



## బీఆర్ఎస్‌ను తిట్టేందుకు కవిత చాలు

మన దృష్టి అభివృద్ధిపైనే

మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు

.. వివరాలు 2లో



## నోటీసులు ఇవ్వకుండా చట్టాన్ని అతిక్రమిస్తున్నారా

జర్నలిస్టుల అరెస్టులపై కేటీఆర్ నిప్పులు

ప్రభుత్వంపై ధ్వజమెత్తిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

.. వివరాలు 2లో



## వారు టెర్రరిస్టులా.. అర్ధరాత్రి దాడులేంటి..?

జర్నలిస్టుల అరెస్టులపై హరీష్ రావు గర్జన


.. వివరాలు 2లో



## తెలంగాణలో మూగజీవాల
# మారణ హోమం

### 900 కుక్కల విషప్రయోగంపై సర్పంచ్‌లపై కేసులు

తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మానవత్వం మంటగలిసే ఘటనలు వెలుగులోకి వచ్చాయి. వీధి కుక్కల బెడదను నివారించాలనే నెపంతో నిబంధనలకు విరుద్ధంగా వందలాది కుక్కలను విషప్రయోగం చేసి చంపడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ అమానుష ఘటనలపై జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పోలీసులు రంగంలోకి దిగి పలువురు ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు చేశారు.



### కామారెడ్డి జిల్లాలో ఘోరం: 600 కుక్కల బలి

తెలంగాణ బ్యూరో, జనవరి 14 (తీన్మార్ న్యూస్): కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండల పరిధిలో ఏకంగా సుమారు 600 కుక్కలను విషం పెట్టి చంపిన ఉదంతం కలకలం

మిగతా 2 లో



## వెంటనే ఇరాన్ దేశాన్ని వీడాలి

భారత పౌరులకు కేంద్రం అత్యవసర హెచ్చరిక

ఇరాన్‌లో కొనసాగుతున్న హింసాత్మక నిరసనలు

వేలల్లో మరణాలు సంభవించినట్లు సమాచారం

న్యూ ఢిల్లీ, జనవరి 14 (తీన్మార్ న్యూస్): ఇరాన్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా భారత ప్రభుత్వం అప్రమత్తం అయింది. వివిధ కారణాలతో ఇరాన్ వెళ్లి అక్కడ ఉన్న

మిగతా 2 లో

## ఆదిలాబాద్ సాగునీటి కష్టాలకు
# చెక్ పెట్టనున్న సర్కారు

పెన్‌గంగా నదిపై చనాక-కొరాట నిర్మాణం

14 గ్రామాలకు చేరనున్న జలాలు



05

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసుల సాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన చనాక-కొరాట ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకొచ్చేలా ముందుకు సాగుతున్నది. ఈ ప్రాజెక్టు తెలంగాణ, మహారాష్ట్రల సంయుక్త ప్రాజెక్టు కాగా ఇరు రాష్ట్రాల భాగస్వామ్యంతో నిర్మితమైంది. ఇది పెన్‌గంగా నదిపై 6,677 హెక్టార్ల విస్తీర్ణానికి నిర్మింతమైంది. తెలంగాణలో 5,463 హెక్టార్లు, మహారాష్ట్రలో 1,214 హెక్టార్లకు సాగునీరు అందించడానికి ప్రతిపాదించారు.

## తెలంగాణ గ్రామ పంచాయతీలకు
# "కేంద్రం భారీ నిధులు"

రూ. 260 కోట్లు తక్షణ విడుదల : కిషన్ రెడ్డి వెల్లడి

గతంతో పోలిస్తే 80 శాతం పెరిగిన గ్రాంట్లు



04

## రైలు ప్రయాణికులకు
# గుడ్ న్యూస్

- ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో ఇకపై వేడివేడి నాణ్యమైన టీ, కాఫీలు
- వాల్తేరు రైల్వే డివిజన్ సరికొత్త ప్రయోగం
- విశాఖ - న్యూఢిల్లీ రైలులో సేవలు ప్రారంభం

05





## ఎన్టీవీ ఆఫీస్‌లో సిట్
# మెరుపు సోదాలు

సర్వర్ రూమ్ సీజ్ చేస్తామని బెదిరింపులు.. ఉద్రిక్తత

హైదరాబాద్, జనవరి 14 (తీన్మార్ న్యూస్): మంత్రి, మహిళా ఐఏఎస్ పై ఆరోపణల కేసులో సిట్ దూకుడు పెంచింది. తాజాగా ఎన్టీవీ ఆఫీస్ లో సిట్ సోదాలు చేపట్టింది. ఈ కేసులో గత అర్ధరాత్రి పోలీసులు

మిగతా 2 లో



05

## మేడారం మహా జాతరకు ముస్తాబు

జాతర సమాచారం కోసం వాట్సప్ చాట్ బాట్

మై మేడారం చాట్ బాట్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క

జాతరకు వచ్చే భక్తులు మై మేడారం చాట్ బర్డ్ సద్వినియోగం చేసుకోవాలి. మేడారం మహా జాతరకు వచ్చే భక్తులు మేడారంలో కల్పించిన సౌకర్యాలు ఇతర విషయాలను తెలుసుకోవడానికి ప్రతి ఒక్కరూ మై మేడారం బర్డ్ వాట్సప్‌ను ఉపయోగించుకోవాలని, జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు.

## తప్పు చేయనప్పుడు పారిపోవడమెందుకు

జర్నలిస్టుల అరెస్టులపై సీపీ సజ్జనార్ కీలక వివరణ



### విమర్శల పేరుతో మహిళల క్యారెక్టర్‌ను అటాక్ క్రూరత్వమే

సోషల్ మీడియా ట్రోలింగ్‌పై సీపీ సజ్జనార్ ఫైర్

02

# తెలంగాణలో మూగజీవాల మారణ హోమం



మొదటి పేజీ తరువాయి

రేపుతోంది. వివరాల్లోకి వెళ్తే..

ప్రభావిత గ్రామాలు: భవానీపేట, ఫరీద్‌పేట, వాడి, పాల్వంచ, బండరామేశ్వర్ పల్లి. కుక్కల సంఖ్య పెరిగి ఇబ్బందులు కలిగిస్తున్నాయన్న సాకుతో శాస్త్రీయ పద్ధతులు పాటించకుండా, సర్పంచ్‌ల ఆదేశాలతో ఈ దారుణానికి ఒడిగట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పోలీసుల చర్యలు: స్ట్రే ఆనిమల్ ఫౌండేషన్ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు మాచారెడ్డి పోలీసులు ఐదు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లపై కేసులు నమోదు చేశారు. పాతిపెట్టిన కుక్కల కళేబరాలను వెలికితీసి పశు వైద్యాధికారులు పోస్టుమార్టం నిర్వహించారు.

### హన్మకొండ జిల్లాలో మూడు రోజుల్లో 300 కుక్కల హతం

మరోవైపు హన్మకొండ జిల్లా శాయంపేట, ఆరెపల్లి గ్రామాల్లోనూ ఇదే తరహా పైశాచికత్వం చోటుచేసుకుంది. జనవరి 6 నుండి 8 మధ్య కేవలం మూడు రోజుల్లోనే సుమారుగా 300 కుక్కలను విషపు సూదులతో చంపేశారు. స్ట్రే యానిమల్ ఫౌండేషన్ ప్రతినిధి గౌతమ్ ఫిర్యాదుతో పోలీసులు మొత్తం 9 మందిపై కేసు నమోదు చేశారు. వీరిలో ఇద్దరు సర్పంచ్‌లు, వారి భర్తలు, ఉప సర్పంచ్, ఇద్దరు పంచాయతీ సెక్రటరీలు మరియు కూలీలు ఉన్నారు. కుక్కలను చంపడానికి ప్రత్యేకంగా కూలీలను నియమించుకుని ఈ మారణహోమానికి పాల్పడినట్లు ఎఫ్.ఐ.ఆర్ లో పేర్కొన్నారు.

### జంతు ప్రేమికుల ఆందోళన

పంచాయతీ పాలకవర్గాలే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఇలాంటి అకృత్యాలకు పాల్పడటంపై జంతు సంరక్షణ సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జంతువుల నియంత్రణకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు వంటి మార్గాలు ఉన్నప్పటికీ, ఇలా సామూహికంగా చంపడం నేరమని వారు పేర్కొంటున్నారు.

# ఎన్టీవీ ఆఫీస్‌లో సిట్ మెరుపు సోదాలు



మొదటి పేజీ తరువాయి

ఎన్టీవీకి చెందిన ముగ్గురు జర్నలిస్టులను అరెస్టు చేసిన పోలీసులు బుధవారం మధ్యాహ్నం ఎన్టీవీ కార్యాలయానికి వచ్చారు. నేరుగా కార్యాలయం లోపలికి వెళ్లి సోదాలు చేపట్టారు. ఈ క్రమంలో సెర్చ్ వారెంట్ లేకుండా సోదాలు నిర్వహించేందుకు ఎలా వస్తారని ఎన్టీవీ సిబ్బంది ప్రశ్నంగా అధికారులకు, పోలీసులకు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఎలాంటి సెర్చ్ వారెంట్ లేకుండా సెక్యూరిటీని తోసేసి ఆఫీస్ లోకి పోలీసులు చొచ్చుకు వచ్చారని ఎన్టీవీ సిబ్బంది చెబుతున్నారు. ఎడిటర్ ఎవరు.. ఎడిటర్ క్యాబిన్ ఎక్కడ అంటూ బెదిరించారని, చెప్పకుంటే చానల్ సర్వర్ రూమ్ సీజ్ చేస్తామని బెదిరిస్తున్నారని సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఒక్కసారిగా అక్కడ టెన్షన్ వాతావరణం ఏర్పడింది. మరో వైపు రాత్రి పూట జర్నలిస్టుల అరెస్టులను తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఖండించింది.

# తప్పు చేయనప్పుడు పారిపోవడమెందుకు

హైదరాబాద్, జనవరి 14 (తీన్మార్ న్యూస్): మహిళా ఐఏఎస్ అధికారిణి ప్రతిష్టను దెబ్బతీసేలా అసత్య కథనాలు ప్రసారం చేసిన కేసులో ఎన్టీవీ రిపోర్టర్లను అదుపులోకి తీసుకోవడంపై హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టతనిచ్చారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన, నిందితులు దర్యాప్తుకు సహకరించకుండా విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నిస్తుండటం వల్లే అరెస్టులు చేయాల్సి వచ్చిందని స్పష్టం చేశారు.



### బ్యాంకాక్ పారిపోయే ప్రయత్నం: సీపీ

మహిళా అధికారిపై ఎలాంటి ఆధారాలు లేకుండా క్యారెక్టర్ అస్సాసినేషన్ (వ్యక్తిత్వ హననం) చేస్తూ కథనాలు ప్రసారం చేశారని, ఈ కేసులో విచారణకు హాజరుకావాలని కోరినప్పటికీ కొందరు ప్రతినిధులు సహకరించలేదని సీపీ తెలిపారు. విచారణలో కీలకంగా ఉన్న వ్యక్తులు వస్తామని చెప్పి ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. రాత్రికి రాత్రే బ్యాంకాక్ వెళ్లేందుకు ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకుని ఎయిర్‌పోర్టుకు వెళ్లారు. దేశం విడిచి పారిపోతుంటే పోలీసులు చూస్తూ ఊరుకోవాలా అని ఆయన ప్రశ్నించారు.

### నోటీసులపై క్లారిటీ

అరెస్టులకు ముందు నోటీసులు ఇవ్వలేదన్న ఆరోపణలపై సీపీ సజ్జనార్ తీవ్రంగా స్పందించారు. ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు అయిందంటేనే దర్యాప్తు జరుగుతోందని అర్థం. నిందితులు సక్రమంగా ఉంటే విచారణకు ఎందుకు భయపడుతున్నారు.. విచారణకు పిలిస్తే పారిపోవాల్సిన అవసరం ఏముంది.. అని నిలదీశారు. ఎన్టీవీ సీఈవో కూడా అందుబాటులో లేరని, ఆయన ఎక్కడికి వెళ్లారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# నోటీసులు ఇవ్వకుండా చట్టాన్ని అతిక్రమిస్తున్నారా

హైదరాబాద్, జనవరి 14 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో జర్నలిస్టుల అరెస్టుల్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోందని విమర్శించారు. నోటీసులు ఇవ్వకుండా జర్నలిస్టులను ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. అర్ధరాత్రివేళ అరెస్టులు చేయడం సరికాదని, సీఎం రేవంత్ రెడ్డి పాలనలో మీడియాపై దమనకాండ కొనసాగుతోందని ధ్వజమెత్తారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని సైతం ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ గారు.. మీరు నడుపుతోన్న మొహబ్బత్ కీ దుకాన్ తెలంగాణశాఖ పౌరుల రాజ్యాంగ హక్కుల్ని ఎలా కాలరాస్తుందో చూస్తున్నారని ఆశిస్తున్నాని ఎక్స్ వేదికగా విమర్శలు చేశారు.

### అర్ధరాత్రి అరెస్టులు చేయాల్సిన అవసరమేంటి?

"పండుగ సమయంలో ముగ్గురు జర్నలిస్టులను అరెస్ట్ చేయడాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. తెలంగాణలో కాంగ్రెస్ పాలన ప్రతిసారి ఎమర్జెన్సీ రోజులను గుర్తు చేస్తోంది. జర్నలిస్టులను నేరస్తుల్లా వ్యవహరించేందుకు తెలంగాణ డీజీపీ ఎంతగా పట్టుబడుతున్నారో చూడటం దురదృష్టకరం. వారికి నోటీసులు ఇచ్చి, విచారణకు పిలవవచ్చు కదా. అలా చేయకుండా, అర్ధరాత్రి జర్నలిస్టుల ఇళ్లలోకి వెళ్లి అరెస్టులు చేయడం అత్యుత్సాహం, హద్దులు దాటిన చర్య. అరెస్టు చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని నేను డిమాండ్ చేస్తున్నాను. ఈ కేసుల్లో నమోదు చేసిన సెక్షన్లలో ఏదీ నాన్-బెయిలబుల్ కాదు. అలాంటప్పుడు తెలంగాణ పోలీసులు ఎందుకు అర్ధరాత్రి అరెస్టులు చేసి జర్నలిస్టులను, వారి కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేశారు? బీఎన్ఎస్ సెక్షన్ 35 ప్రకారం నోటీసులు ఇస్తే సరిపోయేదానికి ఇంత దౌర్జన్యం ఎందుకు? ఈ ఘటన ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం. తెలంగాణ డీజీపీ చట్టబద్ధమైన విధానాన్ని పాటించాలని, కాంగ్రెస్ పార్టీ, దాని అప్రామాణిక నాయకత్వం చేస్తున్న చెడు రాజకీయాలకు పాల్పడకుండా ఉండాలని నేను కోరుతున్నాను. అని కేటీఆర్ ఎక్స్ వేదికగా చేసిన పోస్టులో పేర్కొన్నారు.



# విమర్శల పేరుతో మహిళల క్యారెక్టర్‌ను అటాక్ క్రూరత్వమే

## సోషల్ మీడియా ట్రోలింగ్‌పై సీపీ సజ్జనార్ ఫైర్

హైదరాబాద్, జనవరి 14 (తీన్మార్ న్యూస్): ఐఏఎస్ అధికారిణిపై అవాస్తవాలను ప్రచారం చేసిన కేసులో తెలంగాణలో వరుస అరెస్టులు జరగడం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ ఎక్స్ వేదికగా ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. అందులో సమాజంలో మహిళలు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉంటూ నాయకత్వ బాధ్యతలు చేపట్టడం మనం చూస్తున్నాం. పాలన, పోలీసింగ్, సైన్స్, మీడియా వంటి రంగాలతో పాటు కుటుంబ బాధ్యతలను కూడా వారు ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. అయితే, విమర్శ పేరుతో మహిళా అధికారులను, ఉద్యోగినులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో, టీవీ చానెళ్లలో వారి వ్యక్తిత్వాన్ని కించపరచడం విమర్శ కాదని, అది ముమ్మాటికీ క్రూరత్వమేనని మేధావులు హెచ్చరిస్తున్నారు. పబ్లిక్ లైఫ్ లో ఉన్న వారికి విమర్శలు సహజమే అయినప్పటికీ, మహిళల క్యారెక్టర్‌ను అటాక్ చేయడం సభ్య సమాజానికి గొడ్డలి పెట్టు వంటిది మన పురాతన ధర్మం యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః (ఎక్కడ మహిళలు పూజించబడతారో, అక్కడ దేవతలు కొలువై ఉంటారు) అని చెబుతోంది. కానీ నేటి కాలంలో మహిళా అధికారులపై ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న వ్యక్తిత్వ హననం మన నాగరికతనే ప్రశ్నిస్తోంది. మహిళా సాధికారత, ప్రగతి గురించి మాట్లాడుకునే మనం, వారిని అవమానించే ధోరణిని ఏమాత్రం సహించకూడదు. మహిళల గౌరవాన్ని కాపాడలేని సమాజం తన సొంత భవిష్యత్తును తానే పాడుచేసుకుంటుందని, 'భవిష్యత్తు మహిళలదే' అన్న స్పృహతో ప్రతి ఒక్కరూ ఇలాంటి దాడులను ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని సీపీ సజ్జనార్ తన ట్వీట్ లో రాసుకొచ్చారు.

# వెంటనే ఇరాన్ దేశాన్ని వీడాలి






మొదటి పేజీ తరువాయి

భారతీయ పౌరులకు కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కీలక అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న విద్యార్థులు, యాత్రికులు, పర్యాటకులు, వ్యాపారవేత్తలు అందుబాటులో ఉన్న విమానాలు, ఇతర రవాణా మార్గాల ద్వారా వెంటనే ఆ దేశాన్ని వీడాలని సూచించింది. ఈ ఏడాది జనవరి 5న జారీ చేసిన ముందస్తు హెచ్చరికను కొనసాగిస్తూ, ప్రస్తుత పరిస్థితులు మరింత ఆందోళనకరంగా మారుతున్న నేపథ్యంలో ఈ తాజా ఆదేశాలు జారీ చేసింది. ఇరాన్‌లో నివసిస్తున్న భారతీయ పౌరులు, భారత సంతతికి చెందిన వ్యక్తులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం కోరింది. నిరసనలు, ఆందోళనలు జరుగుతున్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని, స్థానిక వార్తలను నిరంతరం గమనిస్తూ ఉండాలని సూచించింది. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయంతో నిరంతరం సంప్రదింపుల్లో ఉండాలని, తమ పాస్‌పోర్ట్‌లు, ఇతర గుర్తింపు పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. దిదిలా ఉంటే ఇరాన్‌లో చెలరేగిన ఆందోళనలు అత్యంత హింసాత్మకంగా మారాయి. ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆందోళనల అణచివేతలో దాదాపు రెండు వేల మంది మరణించి ఉండవచ్చని ఇరాన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే కేవలం రెండు రోజుల్లోనే దాదాపు 12 వేల మంది ప్రాణాలు కోల్పోయినట్లు ప్రముఖ మీడియా సంస్థ 'ఇరాన్ ఇంటర్నేషనల్' ప్రచురించిన కథనం సంచలనంగా మారింది. ఇరాన్ లో నెలకొన్న తాజా పరిస్థితులపై ఐక్య రాజ్య సమితి తీవ్రంగా స్పందించింది.

# బీఆర్ఎస్‌ను తిట్టేందుకు కవిత చాలు

హైదరాబాద్, జనవరి 14 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ పార్టీని, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌ను తిట్టేందుకు ఆయన కూతురు కవిత చాలని.. మనకు వాళ్లను విమర్శించే అవసరం లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. మన దృష్టి తెలంగాణ అభివృద్ధిపై పెడదామని పేర్కొన్నారు. బుధవారం (జనవరి 14) మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర పట్టణంలో పలు అభివృద్ధి పనులకు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ.. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో అన్నిచోట్ల కాంగ్రెస్‌ను గెలిపిస్తే మాకు ఇంకా ఎక్కువ బలంతో పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. మున్సిపాలిటీ ఎన్నికలు పార్టీ గుర్తులతో జరుగుతాయని.. రాష్ట్రంలోని 138 మున్సిపాలిటీలలో బీఆర్ఎస్ 10 శాతం కంటే ఎక్కువ గెలవదని అన్నారు. పార్టీ గుర్తులతో సంబంధం లేని పంచాయతీ ఎన్నికల్లో 40 శాతం స్థానాలు గెలిచామని కేటీఆర్ గొప్పలు చెబుతున్నాడని.. మీ సత్తా ఏంటో మున్సిపల్ ఎన్నికల్లో చూపించండని సవాల్ విసిరారు.



కాగా, 2026, ఫిబ్రవరిలో మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పార్టీ గుర్తుతో జరిగే ఎన్నికలు కావడంతో అన్ని పార్టీలు ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకున్నాయి. మున్సిపాలిటీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు సాధించి రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు భావిస్తున్నాయి.

# వారు టెర్రరిస్టులా.. అర్ధరాత్రి దాడులేంటి..?

## జర్నలిస్టుల అరెస్టులపై హరీష్ రావు గర్జన

హైదరాబాద్, జనవరి 14 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రమ అరెస్టులు కొనసాగుతుండటంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఈ విషయమై ఆయన రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి, తన నిరసనను వ్యక్తం చేశారు. సంక్రాంతి పండుగ వేళ, కోర్టులకు సెలవులు ఉన్న సమయంలో జర్నలిస్టులను అరెస్ట్ చేయడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు.



### అర్ధరాత్రి అరెస్టులపై ఆగ్రహం

ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేశ్‌తో పాటు మరో ఇద్దరు రిపోర్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని హరీష్ రావు ఖండించారు. విదేశాలకు వెళ్తున్న జర్నలిస్టును ఎయిర్‌పోర్టులో అరెస్ట్ చేయడం అమానుషం. ఇళ్ల తలుపులు బద్దలు కొట్టి అర్ధరాత్రి పూట తీసుకెళ్లడానికి వారేమైనా టెర్రరిస్టులా? అని ఆయన నిలదీశారు. విమర్శలు చేసే వారిని, ప్రశ్నించే గొంతులను అణచివేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు.

### డీజీపీకి విజ్ఞప్తి

పోలీసు వ్యవస్థ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని హరీష్ రావు సూచించారు. అరెస్టు చేసే సమయంలో పాటించాల్సిన కనీస న్యాయపరమైన నిబంధనలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఎందుకు విస్మరించారని డీజీపీని ప్రశ్నించారు. ముందస్తుగా నోటీసులు ఇవ్వకుండా, నేరస్తుల వలె ప్రవర్తించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు.

# సొంత గ్రామ మహిళలకు చీరలు పంపిణీ చేసిన మంత్రి సీతక్క





ములుగు, జనవరి 14 (తీన్మార్ న్యూస్): సంక్రాంతి పండుగ సందర్భంగా ములుగు మండలం జగ్గన్నపేట అయిన మంత్రి సీతక్క సొంత గ్రామంలో మహిళలతో సరదాగా గడిపిన రాష్ట్ర మంత్రి సీతక్క, ఇటీవలే జరిగిన స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల్లో తన సొంత గ్రామమైన జగ్గన్నపేట గ్రామంలో పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధి కోసం తనపై ఉన్న నమ్మకానికి సహకరించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అర్రెం వెంకన్న గారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామ ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం సహకరించిన గ్రామ మహిళా సోదరీమణుల సంతోషం కోసం గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్న గుంటూరుపల్లి, అన్నంపల్లి, పులిగుండం, జగ్గన్నపేట గ్రామ మహిళలకు చీరలు అందించి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, జగ్గన్నపేట గ్రామ సర్పంచ్ అర్రెం వెంకన్న, ఉప సర్పంచ్ దేవిరెడ్డి పద్మ, కిసాన్ కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి నూనెటి శ్యామ్ యాదవ్, సీనియర్ నాయకులు దేవిరెడ్డి అంజిరెడ్డి, బీసీ సెల్ అధికార ప్రతినిధి గంద్రత్ జయాకర్, మాజీ సర్పంచ్ ఆది రెడ్డి మండల సీనియర్ నాయకులు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా జరిగిన ముగ్గుల పోటీలు





వెంకటాపూర్, జనవరి 14 (తీన్మార్ న్యూస్): వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట గ్రామపంచాయతీ ఆవరణలో జరిగినటువంటి సంక్రాంతి ముగ్గుల పోటీలకు అధిక సంఖ్యలో తరలివచ్చిన చిన్నారులు మహిళలు. దీనిలోమహిళలు (సీనియర్స్) విభాగంలో బొమ్మ కంటి వంశావతీ రమేష్ (సర్పంచ్) మొదటి బహుమతి 3016, కొండ తిరుపతి (ఉపసర్పంచ్) రెండవ బహుమతి 2016, మూడో బహుమతి కడవెండి తిరుపతి గారు 1516, నాలుగో బహుమతి అన్ని వార్డుల సభ్యులు 1016 రూపాయలు అందజేయడం జరిగింది. జూనియర్స్ (చిన్నారుల) విభాగంలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు, మూడు వీరేష్ మొదటి బహుమతి, 1516, గ్రామ పన్నెండవ వార్డు అభ్యర్థి మద్దెల సువర్ణ రమేష్ రెండవ బహుమతి 1016, కాసాని శ్రీహరి మూడో బహుమతి 616, గంధం కవిత లక్ష్మణ్ నాల్గవ బహుమతి 516 రూపాయలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బొమ్మకంటి వంశావతీ రమేష్ లు మాట్లాడుతూ భోగి మీ ఇంట భోగభాగ్యాలను తీసుకురావాలని, సంక్రాంతి మీకు సుఖ సంతోషాలను విరజిమ్మాలని, అలాగే కనుమ మీకు కమనీయమైన అనుభూతులను అందించాలని శుభాకాంక్షలు తెలియజేస్తూ మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ చిత్తశుద్ధితో పని చేస్తుందని, మహిళల సాధికారతే ముఖ్యమని చెప్పారు. దీనిలో భాగంగా గ్రామ అభివృద్ధే ధ్యేయంగా మంత్రి సీతక్క ఆదేశాల మేరకు గ్రామాన్ని అభివృద్ధి మార్గంలో తీసుకెళ్తానని, ఒక్కటొక్కడిగా ఇచ్చిన హామీలన్ని సమయానికి పూర్తి చేస్తానని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండ తిరుపతి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు మూడు విరేష్,వార్డు సభ్యులు కడివేండి తిరుపతి,పొన్నం మౌనిక రాము, గజవేణి అనిత ధనుంజయ, మద్దెల సువర్ణ రమేష్,మాజీ ఉప సర్పంచ్ కాసాని శ్రీహరి గ్రామ వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యువజన నాయకులు పాల్గొనడం జరిగింది.

# సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై మంత్రి ప్రత్యేక దృష్టి

**ఆదివాసీ సంప్రదాయాలకు ప్రతిబింబంగా ల్యాండ్ స్కేపింగ్**

**క్యూ లైన్ కాంప్లెక్స్ పనులు పూర్తి చేయాలి**

**రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క)**



ఎస్.ఎస్.తాడ్వాయి, జనవరి 14 (తీన్మార్ న్యూస్): ఈ నెల 18న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారానికి రానున్న నేపథ్యంలో, జాతర పనుల పురోగతిని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆమె మేడారం గద్దల ప్రాంగణం చుట్టూ కొనసాగుతున్న ల్యాండ్‌స్కేపింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆదివాసి గిరిజన సంప్రదాయాలు ప్రతిబింబించేలా ల్యాండ్‌స్కేపింగ్ చేపట్టాలని అధికారులకు సూచించారు. గద్దెల ప్రాంగణంలో ఔషధ వనమూలికలు, ఇప్ప పువ్వు వంటి సంప్రదాయానికి ప్రాధాన్యమైన మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. ఈ మొక్కలను మంత్రి సీతక్కతో పాటు జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ ప్రత్యేకంగా ఎంపిక చేసినట్లు వివరించారు. ల్యాండ్‌స్కేపింగ్ పనులు తుది దశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా సమీపంలో నిర్మాణంలో ఉన్న క్యూ లైన్ కాంప్లెక్స్ పనులను మంత్రి పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఈఈ పంచాయతీ రాజ్ అధికారిని మంత్రి సీతక్క ఆదేశించారు. భక్తుల సౌకర్యాల దృష్ట్యా పనుల్లో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, ఆర్ అండ్ బి ఈ ఎన్ సి, ములుగు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఈ ఓ వీరస్వామి, పి ఆర్ ఈ ఈ అజయ్ కుమార్, ఆర్డీఓ వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతర కోసం భూములు ఇచ్చిన రైతులకు ఇళ్ల పట్టాల పంపిణీ

**రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన**

**పారదర్శకంగా భూసేకరణ పూర్తి చేసిన అధికారులకు అభినందనాలు**



ఎస్.ఎస్.తాడ్వాయి, జనవరి 14 (తీన్మార్ న్యూస్): మేడారం జాతర ఏర్పాట్ల కోసం తమ భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క బుధవారం మేడారం ఐటీడీఏ అతిథి గృహంలో రైతులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మేడారం శాశ్వత అభివృద్ధి కోసం ప్రభుత్వం కోరగానే స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భూములు ఇచ్చిన రైతులను తాము ఎప్పటికి గుర్తుంచుకుంటమన్నారు. మేడారం జాతర కోసం భూములు ఇచ్చిన ప్రతి రైతుకు న్యాయమైన పరిహారం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఆమె పేర్కొన్నారు. ఇందులో భాగంగా ములుగు జిల్లా కేంద్రానికి సమీపంలోని ఇంచర్ల ప్రాంతంలో, జాతీయ రహదారి వద్ద ఇళ్ల పట్టాలను కేటాయించినట్లు తెలిపారు. అదేవిధంగా మేడారం జాతర సందర్భంగా వారికి షాపుల కేటాయింపును కూడా చేపట్టి, అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. మేడారం భూసేకరణ పనులను పూర్తిగా పారదర్శకంగా, నమ్మకంగా పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఆర్డీఓ వెంకటేష్లను మంత్రి సీతక్క ఈ సందర్భంగా అభినందించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ ప్రక్రియ విజయవంతమైందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్, ఐటిడిఏ పి ఓ చిత్ర మిశ్ర, ఆర్డీఓ వెంకటేష్, భూములు కోల్పోయిన రైతులు, పూజారులు, ఆదివాసీ సంఘాలు, మేడారం గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి అంత్య పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 14 (తీన్మార్ న్యూస్): మే 21 నుండి జూన్ 1వ తేదీ వరకు మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలో నిర్వహించనున్న సరస్వతి అంత్యపుష్కరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం కాళేశ్వరం దేవాలయ ఈఓ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, దేవాదాయ, ఆర్కిటెక్చర్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి సరస్వతి అంత్యపుష్కరాల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం నిర్వహించిన సరస్వతి ఆది పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని, అంత్య పుష్కరాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. గత పుష్కరాలలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. సరస్వతి అంత్యపుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ. 30.16 కోట్ల నిధులను మంజూరు చేసిందని, ఇందులో రూ. 16 కోట్లతో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అంచనాలు తయారుచేసి ప్రతిపాదనలు పంపించాలని, ఫిబ్రవరి మొదటి వారంలోపే టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కాళేశ్వరం మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా శాశ్వత పనులు చేపట్టాలని, పుష్కరాల సమయంలో భక్తుల రాకపోకలు, భద్రత, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా వంటి అంశాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కాళేశ్వరానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన ఆధ్యాత్మిక వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ సరస్వతి అంత్యపుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ తరపున ప్ పటిష్టమైన బందోబస్తు చేస్తామని తెలిపారు. ట్రాఫిక్ నిర్వహణ, వాహనాల పార్కింగ్, భక్తుల భద్రత వంటి అంశాలపై ముందుగానే ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక రహదారి మార్గాలను పరిశీలిస్తున్నామని, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. వాహనాల పార్కింగ్ సమస్యలు నివారించేందుకు మల్టీ లెవల్ పార్కింగ్ స్థలాలను గుర్తించామని, ప్రైవేట్ వాహనాల నియంత్రణకు డ్రాప్ గేట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ధార్మిక సలహాదారు గోవింద హరి మాట్లాడుతూ సరస్వతి అంత్య పుష్కరాలను ఆది పుష్కరాల మాదిరిగానే అత్యంత వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అంత్యపుష్కరాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న దేవాదాయ శాఖ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాళేశ్వరం క్షేత్రానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసేలా త్వరలోనే కాళేశ్వర ఖండం అనే పుస్తకాన్ని విడుదల చేస్తామని తెలిపారు. పీఠాధిపతులు, హారతి, ఇతర తాత్కాలిక ఏర్పాట్ల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. అంత్యపుష్కరాలకు వచ్చే భక్తులకు గొప్ప ఆధ్యాత్మిక అనుభూతిని అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ మాయం సింగ్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గ్రామ పంచాయతీలకు "కేంద్రం భారీ నిధులు"

హైదరాబాద్, జనవరి 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణలోని గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ స్థాయిలో ప్రజాస్వామ్య వ్యవస్థలను మరింత బలపరిచే లక్ష్యంతో నిధులను విడుదల చేయనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. గత పదేళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం రూ.11 వేల కోట్లకు పైగా నిధులు విడుదల చేసింది. 2015-16 నుంచి 2019-20 మధ్యకాలంలో రూ.5,060 కోట్లను మంజూరు చేయగా, 2020-21 నుంచి 2025-26 కాలానికి నిధులను 80 శాతం పెంచి రూ.9,050 కోట్లకు కేటాయించారు. ఇందులో ఇప్పటికే రూ.6,051 కోట్లను విడుదల చేసినట్లు మంత్రి వెల్లడించారు. గ్రామీణ స్థాయిలో ప్రజాప్రతినిధ్య సంస్థలు బలంగా ఉంటే పాలనలో బాధ్యత, పారదర్శకత పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం గట్టిగా విశ్వసిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. అందుకే స్థానిక సంస్థలకు నిధులను సకాలంలో విడుదల చేస్తోందన్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తవడం, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వినియోగ ధృవీకరణ పత్రాలు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సమర్పించడంతో, 2024-25 సంవత్సరానికి సంబంధించిన తొలి విడతగా రూ.260 కోట్లను త్వరలోనే కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు తెలిపారు. యూసీలు సమర్పించిన వెంటనే మిగిలిన సుమారు రూ.2,500 కోట్లను దశలవారీగా విడుదల చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేక బ్యాంక్ ఖాతా ఉండాలని, ఆ ఖాతా పీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో యూనిక్ ఏజెన్సీ కోడ్‌తో నమోదు అయి ఉండాలని మంత్రి గుర్తు చేశారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల బ్యాంక్ ఖాతాలను అటాచ్ చేసి, ఆ నిధులను ఇతర అవసరాలకు మళ్లించిందని ఆయన ఆరోపించారు. దీని వల్ల తమ పదవీకాలంలో చేసిన పనులకు డబ్బులు రాక పలువురు సర్పంచులు రాజీనామాలు చేయాల్సి వచ్చిందన్నారు. కొన్ని దురదృష్టకర ఘటనల్లో సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని పేర్కొంటూ, ఇది అత్యంత విచారకరమని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామీణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధితో పాటు 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.



# రైలు ప్రయాణికులకు గుడ్ న్యూస్

### ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో ఇకపై వేడివేడి నాణ్యమైన టీ, కాఫీలు

### వాల్తేరు రైల్వే డివిజన్ సరికొత్త ప్రయోగం

### విశాఖ - న్యూఢిల్లీ రైలులో సేవలు ప్రారంభం

న్యూ ఢిల్లీ, జనవరి 14 (తీన్మార్ న్యూస్): రైలు ప్రయాణికులకు సౌత్ సెంట్రల్ రైల్వేస్ గుడ్ న్యూస్ చెప్పింది. ఈ మేరకు వాల్తేరు రైల్వే డివిజన్ పరిధిలో సుదూర ప్రాంతాలకు రైళ్లలో వెళ్లే ప్రయాణికుల ప్రధాన సమస్య అయిన నాణ్యమైన టీ, కాఫీ కొరతను తీర్చేందుకు అధునాతన వెండింగ్ యూనిట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతిష్టాత్మకమైన విశాఖపట్నం - న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో ఈ సేవలను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. సాధారణంగా ప్యాంట్రీ కార్లలో లేదా బయట ప్లాట్‌ఫారమ్‌లపై లభించే పానీయాల నాణ్యతపై ప్రయాణికులు అప్పుడప్పుడు అసంతృప్తి వ్యక్తం చేస్తుంటారు. ఈ సమస్యను అధిగమించేందుకు, విక్రయదారులకు ప్రత్యేకంగా రూపొందించిన 5 లీటర్ల సామర్థ్యం గల వెండింగ్ క్యాన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. వెండింగ్ మెషీన్ల ద్వారా తయారవ్వడం వల్ల పానీయాల నాణ్యతలో స్థిరత్వం ఉండనుంది. థర్మల్ ఇన్సులేషన్ కలిగిన క్యాన్ల వల్ల ప్రయాణికులకు కాఫీ, టీలు ఎప్పుడూ వేడిగానే అందుతాయి. శీతల పానీయాల పంపిణీలో గరిష్ట స్థాయిలో పరిశుభ్రత పాటించేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే, రైళ్లలో కూడా వెండింగ్ మెషీన్లు తీసుకురావడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




# ఉత్సాహంగా సాగిన కైట్ ఫెస్టివల్

### పరేడ్ గ్రౌండ్‌లో సందడిగా ఎగిరిన పతంగులు

## నోరూరించేలా స్వీట్ స్టాల్స్

**హైదరాబాద్,జనవరి14:** సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ వేదికగా 'అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ 2026' ప్రారంభమైంది. రంగురంగుల పతంగులతో భాగ్యనగర ఆకాశం ఒక అద్భుతమైన కాన్వాస్‌లా మారిపోయింది. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకలో ప్రపంచం నలుమూలల నుంచి కైట్ ఫ్లయర్స్ తరలివచ్చారు. రష్యా, పోర్చుగల్, సింగపూర్, శ్రీలంక, థాయిలాండ్, ఉక్రెయిన్, వియత్నాం, జపాన్, ఇటలీ, ఫ్రాన్స్, కెనడా, ఆస్ట్రేలియా వంటి 19 దేశాల నుండి 40 మంది నిపుణులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. అలాగే భారత దేశంలోని 15 రాష్ట్రాల నుండి 55 మంది జాతీయ స్థాయి కైట్ ప్లేయర్స్ పాల్గొని వైవిధ్యమైన పతంగులను ఎగురవేస్తున్నారు. భూమి నుండి ఆకాశానికి రంగురంగుల సందేశాలు పంపుతున్నారా అన్నట్టుగా గ్రౌండ్ అంతా పతంగులతో నిండి పోయింది. డాల్ఫిన్లు, కార్టూన్ క్యారెక్టర్లు, డ్రాగన్లు, భారీ ఆకారాల్లో ఉన్న గాలిపటాలు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. ఈ సందర్భంగా హైదరాబాద్ కైట్ ఫెస్టివల్‌లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. ఇక్కడి ప్రజల ఉత్సాహం, ఆతిథ్యం అద్భుతం అని అంతర్జాతీయ ప్లయర్స్ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ ఏడాది మరికొన్ని పతంగులతో పాటు ప్రత్యేక ఆకర్షణలు కూడా తోడయ్యాయి. అక్కడ వివిధ రాష్ట్రాల సంప్రదాయ మిఠాయిల స్టాల్స్ ఆహార ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. జనవరి 16 నుంచి 18 వరకు పరేడ్ గ్రౌండ్‌లో హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్, అలాగే గచ్చిబౌలి స్టేడియంలో డ్రోన్ ఫెస్టివల్ కూడా జరగనున్నాయి. ఇదిలావుంటే కైట్ ఫెస్టివల్‌కు తోడు స్వీట్ ఫెస్టివల్ కూడా అలరించింది. రకరకాల స్వీట్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి.



## గ్రామంలో వాటర్ ప్లాంట్ శంకుస్థాపన

### సంస్థ వారిని అభినందించిన సర్పంచ్ ఉప సర్పంచ్



వెంకటాపూర్, జనవరి 14 (తీన్మార్ న్యూస్): వెంకటాపూర్ మండలం ఇంచెన్ చెరువు పల్లి గ్రామంలో నిర్మన్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరుగుతుంది, గత రెండు సంవత్సరాలుగా సంస్థ ఊరిలో వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయడం వీధి దీపాలు ఏర్పాటు చేయడం రైతులకు కావలసిన పలు స్ప్రే పంపులు మొక్కజొన్నపెట్టడానికి మిషిన్స్ గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు గేదెల పంపిణీ చేయడం జరిగినది. ఇలా గ్రామంలో గొప్ప గొప్ప కార్యక్రమాలు చేయడం జరిగినది బుధవారం గ్రామంలో ప్రజలకు ఉపయోగపడే ఒక గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చేయడం జరిగినది. ప్రభుత్వ భూమి అయినా మర్రి పాపిరెడ్డి వాళ్ళ ఇంటి దగ్గరలో వాటర్ ప్లాంట్ శంకుస్థాపన చేయడం జరిగినది. ఇట్టి కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఇస్రా నాయక్ ఉపసర్పంచ్ సరిత (రాజు) వార్డ్ మెంబర్స్ ఎడ్ల మురళి కామా ప్రవళిక (అశోక్) బానోత్ సునీత (అరుణ్) గ్రామ పెద్దలు గ్రామ యువత గ్రామపంచాయతీ సిబ్బంది వారు కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది. ఇలాంటి గొప్ప కార్యక్రమాలు చేస్తున్నటువంటి నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంస్థ వారిని సర్పంచ్ ఉప సర్పంచ్ గ్రామ పెద్దలు అభినందించడం జరిగినది.

## సంక్రాంతి పండుగ నేపథ్యంలో షటిల్ క్రీడలను ప్రారంభించిన సర్పంచ్



గోరికొత్తపెల్లి, జనవరి 14 (తీన్మార్ న్యూస్): గోరి కొత్తపెల్లి మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ను సర్పంచ్ జవాజి రమేష్ ముదిరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని తెలియజేస్తాయని ఈ సందర్భంగా క్రీడాకారులకు తెలియజేశారు. అలాగే గురువారం సంక్రాంతి సందర్భంగా గ్రామంలో ముగ్గుల పోటీ కార్యక్రమం ఉంటుందని ఈ సందర్భంగా గ్రామస్తులకు మరియు ముఖ్యంగా గ్రామంలోని మహిళలకు ముగ్గుల పోటీ ఉంటుందని తెలియజేశారు. గ్రామంలోని మహిళలు అందరూ పాల్గొని ఈ యొక్క ముగ్గుల పోటీ విజయవంతం చేయవలసిందిగా మహిళలకు తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో ఏప్రిల్ నుంచి 'జనగణన' షురూ

### కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన




తెలంగాణ బ్యూరో, జనవరి 14 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో 2026 ఏప్రిల్ నుంచి సర్ ప్రక్రియను మొదలు పెట్టనున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు పేర్కొన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో సర్ ప్రారంభించి, మే మూడవ వారానికల్లా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలియజేసారు. కాగా కేంద్ర ఎన్నికల సంఘం సర్ ప్రక్రియ తొలి దశను బిహార్ లో పూర్తి చేయగా ప్రస్తుతం రెండో దశలో దేశంలోని 9 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో కొనసాగిస్తోంది. రెండవ దశలో గుజరాత్, తమిళనాడు, వెస్ట్ బెంగాల్, ఉత్తర ప్రదేశ్ వంటి పలు రాష్ట్రాల్లో తుది దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఇరు తెలుగు రాష్ట్రాలతోపాటు మరికొన్ని రాష్ట్రాల్లో మూడవ దశ సర్ ప్రక్రియను చేపడతామని అధికారులు వెల్లడించారు. అయితే ఈ సర్ ప్రక్రియపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం తెలుపుతున్న సంగతి తెలిసిందే.

# ఆదిలాబాద్ సాగునీటి కష్టాలకు చెక్ పెట్టనున్న సర్కారు

## పెన్‌గంగా నదిపై చనాక-కొరాట నిర్మాణం

## 14 గ్రామాలకు చేరనున్న జలాలు



తెలంగాణ బ్యూరో, జనవరి 14 (తీన్మార్ న్యూస్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసుల సాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన చనాక-కొరాట ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకొచ్చేలా ముందుకు సాగుతున్నది. ఈ ప్రాజెక్టు తెలంగాణ, మహారాష్ట్రల సంయుక్త ప్రాజెక్టు కాగా ఇరు రాష్ట్రాల భాగస్వామ్యంతో నిర్మితమైంది. ఇది పెన్‌గంగా నదిపై 6,677 హెక్టార్ల విస్తీర్ణానికి నిర్మింతమైంది. తెలంగాణలో 5,463 హెక్టార్లు, మహారాష్ట్రలో 1,214 హెక్టార్లకు సాగునీరు అందించడానికి ప్రతిపాదించారు. కమాండ్ ఏరియా మూడు మండలాల్లోని 14 గ్రామాలలో ఉంది. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలోని తాంసి, ఆదిలాబాద్, జైనథ్, మహారాష్ట్రలోని యావత్మల్ జిల్లాలోని కేలాపూర్ తహసీల్‌లోని తొమ్మిది గ్రామాలకు సాగునీరు అందించనున్నారు.

### 2016లో ఒప్పందం

ఆగస్టు 23, 2016న ముంబైలో జరిగిన అంతర్రాష్ట్ర బోర్డు సమావేశంలో తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాలు చనాక-కొరాట బ్యారేజీ నిర్మాణం కోసం ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ ప్రాజెక్టు కారణంగా 23 గ్రామాల్లోని 283 మంది ప్రజలు ప్రభావితమయ్యే అవకాశం ఉన్నది. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.399.16 కోట్లు కాగా ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే పర్యావరణ అనుమతులు సైతం లభించాయి. 2016లో జరిగిన ఒప్పందం ప్రకారం తెలంగాణ, మహారాష్ట్ర సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టాయి. తెలంగాణలోని 5,463 హెక్టార్లకు, మహారాష్ట్రలోని 1,214 హెక్టార్లకు ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందనుంది. ఇందుకోసం పెన్ గంగ నదిపై లోయర్ పెన్ గంగ దిగువన 23 గేట్లతో 0.8 టీఎంసీల సామర్థ్యంతో బ్యారేజీ నిర్మించనున్నారు. చనాక-కొరటా బ్యారేజీ ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 13వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఆనకట్ట నుంచి లోయర్ పెన్ గంగ కాల్వల ద్వారా మరో 47వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. మొత్తంగా ఆదిలాబాద్ జిల్లాలో 50 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందనుంది.

### 23 గేట్లతో బ్యారేజీ నిర్మాణం.

ఇప్పటికే 23 గేట్లతో చనాక-కొరాట బ్యారేజీ నిర్మాణం పూర్తయింది. ప్రాజెక్టులో భాగంగా 35మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఆరు మోటార్ల ద్వారా 13,500 ఎకరాలకు సాగునీరు, గ్రావిటీ కెనాల్ ద్వారా 47,500 ఎకరాలకు నీరు అందించాలని నిర్ణయించారు. ఆదిలాబాద్ జిల్లాలోని పలు మండలాలకు తాగు, సాగునీటిని అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. వాస్తవానికి 1975లో చనాక కొరాటా ప్రాజెక్టు నిర్మాణం కోసం మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ మధ్య ఒప్పందం జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో అన్ని ప్రక్రియలు పూర్తిచేసుకున్నా పనులు ఆలస్యమయ్యాయి. ఆరు మోటార్లకుగాను ఒక మోటార్ డ్రైరన్ ఇప్పటికే పూర్తి కాగా వెట్‌రన్‌ను సైతం పూర్తిచేశారు. అయితే ఈ ప్రాజెక్టు పనులు పదేండ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో ఇప్పటికీ చుక్క నీరందడం లేదు. నిధులు కేటాయించడంతోపాటు వెంటనే రిలీజ్ చేస్తేనే కాలువలు, డిస్ట్రిబ్యూటర్ల నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంది.

### పెండింగ్ ప్రాజెక్టులకు కాంగ్రెస్ ప్రాధాన్యం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేయాలని నిర్ణయించింది. ఇందులో చనాక-కొరాటను సైతం తీసుకుంది. గత బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టు పూర్తికి రూ.179 కోట్లు సైతం కేటాయించింది. గత బీఆర్ఎస్ హయాంలో పంప్‌హౌజ్, రిజర్వాయర్, డిస్ట్రిబ్యూటర్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. ముందుగా రూ.386 కోట్ల అంచనాతో చేపట్టగా, ఫండ్స్ సరిపోవడం లేదంటూ రూ.1,227 కోట్లకు పెంచారు. అయినా ప్రాజెక్టు పూర్తి కాలేదు. రూ.2 వేల కోట్లకు అంచనాలు పెంచినప్పటికీ, నిధులు విడుదల చేయకపోవడంతో సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. 2018లోనే ఈ ప్రాజెక్టు పూర్తిచేయాల్సి ఉండగా నిధుల కొరతతో పదేళ్లుగా గడువు పెంచుతూ వస్తున్నారు.

### ఈ నెల 16న సీఎం పర్యటన

ఈ ప్రాజెక్టును కీలకంగా తీసుకున్న ప్రభుత్వం పూర్తిచేసే దిశగా ముందుకు సాగుతున్నది. అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 16న ప్రాజెక్టు సందర్శనకు వెళ్తున్నారు. భోరాజ్ మండలం హాతీఘాట్ గ్రామంలో పంప్‌హౌస్‌ను ప్రారంభించనున్నారు. కాగా ఈ నెల 16న సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర మంత్రులు, ఉన్నతాధికారుల ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో నేపథ్యంలో మంగళవారం భోరాజ్ మండలం హాతీఘాట్ గ్రామంలో చనాక-కొరాట పంప్ హౌస్ వద్ద ప్రారంభోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, అధికారులు పరిశీలించారు. అలాగే సీఎం అదే రోజు నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ గ్రామంలో సదర్మాట్ బ్యారేజీని ప్రారంభించనుండగా దీనికి సంబంధించిన ఏర్పాట్లను నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం పరిశీలించారు.

### 2027 డిసెంబర్ నాటికి పూర్తి

చనాక-కొరాట బ్యారేజికి భూసేకరణ పెండింగులో ఉన్నందున షెడ్యూల్ ప్రకారం పని పూర్తి కాలేదు. ఇప్పటివరకు భూసేకరణ ఇతర వ్యయాలతోపాటు ఈ ప్రాజెక్టుపై చేసిన వ్యయం రూ.1244.66 కోట్లు. ఇంకా కావలసిన నిధులు రూ. 792.91 కోట్లు. 2027, డిసెంబరు నాటికి పూర్తి చేసేలా కేటగిరి-బి క్రింద ప్రాజెక్టుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. ఆ ప్రకారంగా, 2025-26 ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భూసేకరణ, ఇతర పనుల కోసం రూ.147.00 కోట్ల నిధులను కేటాయించడమైంది. రూ.71.96 కోట్ల భూసేకరణ బిల్లులను జిల్లా కలెక్టరు, ఆదిలాబాద్ విడి ఖాతాకు జమ చేయడమయింది. ఈ ప్రాజెక్టు డిసెంబరు, 2027 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించడం జరిగింది.

# మేడారం మహా జాతరకు ముస్తాబు

## జాతర సమాచారం కోసం వాట్సప్ చాట్ బాట్

## మై మేడారం చాట్ బాట్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క



ములుగు, జనవరి 14 (తీన్మార్ న్యూస్): జాతరకు వచ్చే భక్తులు మై మేడారం చాట్ బర్డ్ సద్వినియోగం చేసుకోవాలి. మేడారం మహా జాతరకు వచ్చే భక్తులు మేడారంలో కల్పించిన సౌకర్యాలు ఇతర విషయాలను తెలుసుకోవడానికి ప్రతి ఒక్కరూ మై మేడారం బర్డ్ వాట్సప్‌ను ఉపయోగించుకోవాలని, జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మేడారం మహా ఘట్టాన్ని కనులారా వీక్షించేందుకు ప్రతి ఒక్కరు మేడారం రావాలని ఆమె పిలుపు నిచ్చారు. బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్‌లతో కలసి మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

### జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుంది

ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ఈనెల 28 నుండి 31వ తేదీ వరకు జరిగిన మహా జాతరకు మూడు కోట్ల మంది భక్తులు వస్తారనే అంచనాతో 150 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులతో పాటు 101 కోటి రూపాయలతో ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టడం జరిగిందని, ఎలాంటి లోటు పాట్లు ఏర్పడకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని, అమ్మవార్ల దర్శనం కోసం వచ్చే భక్తులను తిరిగి వాళ్ళ ప్రాంతాలకు సురక్షితంగా చేరవేయడానికి ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇప్పటికే ముందస్తు మొక్కుల్లో భాగంగా సెలవు రోజులలో లక్షలాది మంది భక్తులు మేడారం చేరుకుంటున్నారని, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతుండగానే భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా దర్శనాలను కల్పిస్తున్నామని తెలిపారు.

### ములుగు జిల్లాను తీసివేయడం జరగదు.. ప్రజల సౌలభ్యం కోసమే జిల్లాల పునరుద్ధరణ

ప్రజల సౌలభ్యం కోసమే రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టిందని, ములుగును ఎట్టి పరిస్థితిలో జిల్లా తీసివేయడం జరగదని మంత్రి సీతక్క అన్నారు. బుధవారం మేడారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా ములుగు జిల్లాను సాధించుకోవడం జరిగిందని, స్వర్గీయ మాజీ ఎంపీపీ నల్లల కుమారస్వామి పోరాటం ఫలితంగా జిల్లాను ఏర్పాటు చేసుకున్నామని ఎట్టి పరిస్థితిలో ములుగును జిల్లాగా తీసివేయడం జరగదని స్పష్టం చేశారు. కొందరు కావాలనే పలు రకాల ప్రచారం చేస్తున్నారని, వారి మాటలను ఎవరు నమ్మవద్దని కోరారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని, దీనిని శాస్త్రీయంగా నిర్ణయించడానికి ప్రత్యేక జడ్జితో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.

### పుష్కరాలకు సైతం ప్రత్యేక నిధులను ప్రభుత్వం కేటాయిస్తుంది

తనను ఒక ఆడబిడ్డగా చూస్తూ ములుగు జిల్లాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అడగ్గానే నిధులు కేటాయిస్తున్నారని, రాష్ట్రంలో ములుగు జిల్లాలు అభివృద్ధిలో మొదటి స్థానంలో ఇస్తామని అన్నారు. ఈ నెలలో మేడారం మహా జాతర జరుగుతుండగా రానున్న రోజులలో గోదావరి పుష్కరాలు సైతం ఇదే జిల్లాలో జరగనున్నాయని, పుష్కరాలకు సైతం ప్రత్యేక నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా గ్రంథలయ చైర్మన్ బానోతు రవిచంద్ర, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### ఈ నెల 18న సీఎం మేడారం రాకా.. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ నెల 18న మేడారం రానున్నారని మంత్రి సీతక్క అన్నారు. బుధవారం గోవిందరావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మేడారం మహా జాతర ఘట్టాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో చేపట్టిన పనులను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని, గతంలో ఎన్నడు లేని విధంగా 19వ తేదీన అమ్మవార్ల దర్శనం అనంతరం క్యాబినెట్ సమావేశం మేడారంలో నిర్వహించడం జిల్లాకే తలమానికంగా మారబోతున్నదని ఆమె హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పాల్గొనే ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీతక్క కోరారు.

# భారత పాస్‌పోర్ట్‌కు పెరిగిన పవర్

## హెన్లీ ఇండెక్స్‌లో 80వ స్థానానికి భారత్

## ప్రపంచంలోనే శక్తివంతమైన పాస్‌పోర్ట్‌గా సింగపూర్

## 192 దేశాలకు వీసా లేని ప్రవేశం







న్యూ ఢిల్లీ, జనవరి 14 (తీన్మార్ న్యూస్): భారత పాస్‌పోర్ట్ బలపడింది. హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్-2026లో భారత్ ఐదు స్థానాలు ఎగబాకి 80వ స్థానానికి చేరుకుంది. భారత పాస్‌పోర్ట్ ప్రస్తుతం 62 దేశాలకు వీసా లేకుండా లేదా వీసా ఆన్ అరైవల్ తో ప్రయాణించే అవకాశం ఉంది. గత అంతర్జాతీయ ప్రయాణ స్వేచ్ఛలో గణనీయమైన మెరుగుదల కనిపిస్తోంది. లండన్ కేంద్రంగా పనిచేసే హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్2 విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో సింగపూర్ పాస్‌పోర్ట్ ప్రపంచంలోనే అత్యంత శక్తి మంతమైనదిగా నిలిచింది. సింగపూర్ పౌరులకు 192 దేశాలకు వీసా ఫ్రీ యాక్సెస్ లభిస్తోంది. జపాన్, దక్షిణ కొరియా రెండో స్థానంలో నిలిచి 188 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించే అవకాశం పొందాయి. అత్యల్ప శక్తివంతమైన పాస్‌పోర్ట్ ఆఫ్ఘనిస్తాన్ చివరి స్థానంలో నిలిచింది. ఆ దేశ పాస్‌పోర్ట్ కేవలం 24 దేశాలకు మాత్రమే వీసా లేకుండా వెళ్లగల పరిస్థితి ఉంది. ప్రపంచ ప్రయాణ స్వేచ్ఛలో అసమానతలు పెరుగుతున్నాయని హెన్లీ నివేదిక స్పష్టం చేసింది. యూరప్ దేశాలు టాప్ ర్యాంకుల్లో ఆధిపత్యం కొనసాగిస్తుండగా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఐదో స్థానానికి చేరి ప్రత్యేకగుర్తింపు సాధించింది. యూఏఈ పాస్‌పోర్ట్ తో 184 దేశాలకు వీసా అవసరం లేదు. ఆస్ట్రేలియా, కెనడా, మలేసియా టాప్-10లో చోటు దక్కించుకోగా, అమెరికా మళ్లీ పదో స్థానానికి చేరింది. భారత్ ర్యాంకు మెరుగుపడటం దేశానికి పెరుగుతున్న అంతర్జాతీయ ప్రాధాన్యతకు సంకేతమని నిపుణులు చెబుతున్నారు.

# నల్ల చెరువులో 'హైడ్రా' పతంగుల సందడి

## 16 ఎకరాలు.. 30 ఎకరాలకు విస్తరించిన నల్ల చెరువు

## అభివృద్ధి పనులపై కమిషనర్ రంగనాథ్ హర్షం



హైదరాబాద్, జనవరి 14 (తీన్మార్ న్యూస్): కూకట్‌పల్లి నల్ల చెరువులో బుధవారం పతంగుల పండుగ ఘనంగా నిర్వహించారు. పతంగుల పండుగ కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ చిన్నారులతో, యువతతో కలిసి పతంగులు ఎగరేయడం తన యవ్వన జీవితాన్ని గుర్తు చేసిందని అన్నారు. 2024 సెప్టెంబర్‌లో నల్ల చెరువు అభివృద్ధి పనులను చేపట్టినప్పుడు తీవ్ర నిరసనలు ఎదురయ్యాయని అన్నారు. నల్ల చెరువు అభివృద్ధి చేసి నేడు పతంగుల పండుగను నిర్వహిస్తుంటే స్థానికులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని, నల్ల చెరువు వద్ద పండుగ వాతావరణం కనిపిస్తుందని అన్నారు. గతంలో కబ్జాకు గురై 16 ఎకరాలకు కుంచించుకుపోయిన చెరువును కబ్జా చెర నుంచి రక్షించి 30 ఎకరాలకు విస్తరించడం జరిగిందని అన్నారు. చెరువులో 10 అడుగుల లోతు పేరుకు పోయిన పూడికను తొలగించి చెరువు నుంచి మురికిని తొలగించి శుభ్రమైన నీటితో నింపడం జరిగిందని అన్నారు. అదే విధంగా చెరువు లోతును పెంచడం ద్వారా పరిసర ప్రాంతాల్లో వరద సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పై మెరుగులు దిద్దడం కాకుండా చెరువుల అభివృద్ధి అంటే ఇలా ఉండాలని నిరూపించామని అన్నారు. ఇప్పుడు చెరువును చూస్తే ఎంతో ఆహ్లాదంగా ఉందని, మరిన్ని అందాలు సమకూర్చుతున్నామని అన్నారు. నల్ల చెరువుకు వాకింగ్ చేయదానికి కూకట్‌పల్లికి 5 కిలోమీటర్ల దూరం నుంచి సైతం వస్తున్నట్టు వాకర్స్ చెప్పడం ఆనందాన్ని ఇచ్చిందని అన్నారు.

### ఎంతో ఆనందాన్ని ఇచ్చింది

నల్ల చెరువులో షటిల్ కోర్టు, కమ్యూనిటీ హాల్, యోగ కేంద్రం, సైకిల్ ట్రాక్, పికిల్ బాల్ అనేక క్రీడలు అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. అన్ని ప్రజలు ఉచితంగా వినియోగించేలా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అదే విధంగా హైడ్రా మొదటి విడతగా 6 చెరువులను అభివృద్ధి చేయడం జరిగిందని, అందులో బతుకమ్మకుంటను ప్రారంభించడం జరిగిందని అన్నారు. మరో 3 చెరువులను ఫిబ్రవరిలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. వీటికి తోడు మరో 14 చెరువుల అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందని అన్నారు. మిగిలిన చెరువుల అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. నగరంలో 100 చెరువులు అభివృద్ధి జరిగితే చాలావరకు వరదలను నియంత్రించవచ్చని అన్నారు. మురికి కూపాలుగా ఉన్న చెరువులను ఆహ్లాదకరంగా మార్చుతున్నామని, దీంతో భూగర్భ జలాలు పెరగడమే కాకుండా మంచి నీరు అందుబాటులోకి వస్తుందని అన్నారు. మురికి కూపాలుగా ఉన్న చెరువులో నేడు వేడుకలకు వేదికలవ్వడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని అన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ చిన్నారులతో కలిసి పతంగులు ఎగరేశారు. అనంతరం స్థానికులు రంగనాథ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ మిఠాయిలు తినిపించారు.



# సర్వహితం సంక్రాంతి సంబరం

తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడుతూ... ఆధునిక హంగులను సైతం సదాచారం వైపు నడిపించే పండుగ సంక్రాంతి. 'క్రాంతి' అంటే వెలుగు. 'సంక్రాంతి' అంటే కొత్తదైన వెలుగు. మన జీవితాల్లో కొత్త వెలుగు నిండాలని కోరుకుంటూ చేసుకొనే సమష్టి ఆరాధన సంక్రాంతి. అందుకే పండుగల్లో ఇది అగ్ర తాంబూలాన్ని అందుకుంది.

సంక్రాంతి అంటే భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పేరుతో నాలుగు రోజుల ఆటవిడుపు కాదు. జీవన సంస్కృతికి ప్రతిబింబమైన సామాజిక పర్వదినం. రంగవల్లులు, గొబ్బెమ్మలు, బంతిపూలు, రేగు పండ్లు, బసవన్నలు, హరిదాసులు, పిండివంటలు, కొత్త బియ్యం, కోడి పందేలు, పతంగులు, చెరుకు గడలు, భోగి మంటలు, తర్పణాలు, దాన ధర్మాలు, ఆత్మీయమైన పలకరింపులు, అనుబంధాల సరదాలు, ఆచార వ్యవహారాలు... వీటన్నిటి సమాహారం సంక్రాంతి.

సంక్రాంతి సందడి భోగి రోజునే ప్రారంభమవుతుంది. పాత కలపను, వృధా వస్తువులను భోగి మంటల్లో వేసి, అగ్ని ఆరాధన చేయడం అంటే... పాత వాసనలు, వృధా ఆలోచనలు వదులుకొని కొత్త ఆశలతో జీవించాలనే సందేశం. కాలం కదిలిపోతుంది. భవిష్యత్తు వర్తమానం అవుతుంది. వర్తమానం కూడా గతం అనే మహార్ణవంలో కలిసిపోతుంది. గతాన్ని మరచి, భవిష్యత్తుకోసం దిగులు పడకుండా వర్తమానంలో జీవించాలని భోగి మంటలు చెబుతాయి. భోగి అనగానే గుర్తుకువచ్చేది భోగి పండ్లు. అపురూపమైన పసితనానికి దిష్టి తగలకుండా, అన్ని ఆనందాలూ పిల్లలకు లభించాలని ఆశీర్వదించేవే భోగి పండ్లు. ఆరోగ్యం, ఆనందం అనే భాగ్యాలను తెచ్చే భోగి పండుగ అద్వితీయమైన రోజు. బలి చక్రవర్తిని వామనుడు మూడు అడుగుల నేలను అడిగి, విశ్వమంతా వ్యాపించినది భోగి రోజునే అని, వ్యవసాయానికి ఆధారమైన వర్షానికి కారకుడు ఇంద్రుడు. ఆయన కృపవల్ల పంటలు సమృద్ధిగా చేతికి వచ్చాయని కృతజ్ఞతలు చెప్పుకొనే అవకాశాన్ని భోగి ఇచ్చిందని పురాణాలు చెబుతున్నాయి.

### శుభ సంక్రాంతి

సూర్యుడు మకర రాశిలోకి సంక్రమణం చేసే శుభపర్వం మకర సంక్రాంతి. అన్ని పండుగలు చాంద్రమానం ప్రకారం చేసుకుంటే... సౌరమానం ప్రకారం జరుపుకొనే పండుగ సంక్రాంతి. ఆ రోజు నుంచే దక్షిణాయనం ముగిసి, ఉత్తరాయణం మొదలవుతుంది. శుభకార్యాలకు నెలవైన కాలం ఉత్తరాయణం. మకర సంక్రమణం తరువాత ఇళ్ళలో శుభకార్యాలను తలపెట్టడం ఆనవాయితీ. మనిషి తనలోని ప్రతికూల లక్షణాలన్నిటినీ వదులుకొని, సత్ప్రవర్తన అలవరచుకోవాలనే సందేశానికి ప్రతీక ఈ పండుగ. భగీరథ ప్రయత్నం ఫలించి, గంగానది భువిపై పరుగులు పెట్టిన రోజుగా దీన్ని పేర్కొంటారు. మనిషికి జీవితాన్ని, అస్థిత్వాన్ని ఇచ్చిన పూర్వీకులను సంస్మరించుకుంటూ తర్పణాలు ఇవ్వడం, దానాలు చేయడం సంక్రాంతి విధి. మనిషిని బ్రతికించేది అన్నం. సంక్రాంతి నాడు కొత్త ధాన్యంతో పరమాన్నం చేసి, భగవంతుడికి నివేదించి,



అందరికీ అన్నం సమృద్ధిగా లభించాలని ఆకాంక్షించడం... సార్వజనీన సౌభాగ్యాన్ని సహృదయంతో కోరుకోవడమే అవుతుంది.

### కృతజ్ఞతలే కనుమ

ప్రపంచానికి అన్నం పెట్టే రైతులతో కలిసి ఆరుగాలం శ్రమించే బసవన్నలను అలంకరించి, పూజలు నిర్వహించి, కృతజ్ఞతలు చెల్లించుకొనే మహత్తర పర్వం... కనుమ. పశుపక్ష్యాదులను కూడా గౌరవించుకొనే సందర్భం. పశుపోషణ, రక్షణ మానవుల కర్తవ్యం. వాడుకలో 'కనుమ'గా ఉపయోగించే పదానికి అసలు రూపం... కనుముపులు. 'కనుము' అంటే పశువు, 'పులు' అంటే మాలిన్యం. పశువుల మాలిన్యాన్ని శుభ్రపరచడం వెనుక... మనిషిలోని పశుత్వాన్నీ, మాలిన్యాన్నీ కడిగేసుకోమనే అర్థం దాగుంది. ప్రపంచంలో మనతోపాటు కలిసి ఉండే జీవజాతికి మంచి మనసుతో, నిష్కల్మషంగా కృతజ్ఞతలు తెలుపుకోవడమే అసలైన కనుమ పండుగ.

### సంఘీభావమే ముక్కనుమ

సంక్రాంతి పండుగ వాతావరణానికి ముగింపు శోభను సంతరించే ముక్కనుమ... అందరినీ కలుపుకొనే విశేషమైన పర్వం. అందరినీ మనవారనుకొని ఊరంతా ఒక్కటయ్యే సూత్రం... రథం ముగ్గు రూపంలో ప్రతి ఇంటినీ ఒక్కటిగా చేస్తుంది. మనిషి



సంఘజీవి. సంఘీభావంతోనే మనిషి మనుగడ సాధ్యపడుతుంది. 'నేను, నాది' అనే స్వార్థానికి తావివ్వని సమైక్య భావన మనలో ధ్వనించాలనేదే ముక్కనుమ సారాంశం.

# ఆరోగ్యమే మహాభాగ్యం

ఈ కొత్త సంవత్సరంలో జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని ఎన్నో తీర్మానాలు, నిర్ణయాలు తీసుకొని ఉంటాం. భవిష్యత్తును బంగారంలా తీర్చిదిద్దుకోవడానికి మరెన్నో ప్రణాళికలు వేసి ఉంటాం.

కానీ ఏది సాధించాలన్నా ప్రధానంగా కావల్సింది... దృఢమైన ఆరోగ్యం. అప్పుడే కదా... ఉల్లాసంగా, ఉత్సాహంగా ఏ పని అయినా చేయగలుగుతాం. మరి ఆరోగ్యం కాపాడుకోవాలంటే..! క్రమం తప్పని వ్యాయామం, ఆహార నియమాలతోపాటు క్రమశిక్షణ అలవరుచుకోవడం తప్పనిసరి అంటున్నారు న్యూట్రిషనిస్టులు.


ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండాలంటే శరీరం కదలాలి. దానికి ప్రభావవంతమైన మార్గం వ్యాయామం. వర్కవుట్స్ అనగానే ఏ జిమ్‌కో, పార్కుకో వెళ్లాల్సిన పని లేదు. బిజీ షెడ్యూల్స్‌తో సమయం లేదనుకొంటే ఇంటి వద్దే వ్యాయామం చేసుకోవచ్చు. చిన్న చిన్న ఎక్సర్‌సైజ్‌లతో మొదలుపెట్టండి. అంటే సులువుగా చేసుకొనే ప్లాంక్స్, స్కాట్స్, కార్డియో లాంటివి. అయితే ఉదయం లేదా సాయంత్రం క్రమం తప్పకుండా రోజుకు కనీసం అరగంట నుంచి నలభై నిమిషాలు వ్యాయామం చేయాలి.

ఆరోగ్యంగా జీవించాలంటే సరైన హైడ్రేషన్ చాలా అవసరం. ముఖ్యంగా వ్యాయామం చేసేటప్పుడు అలసట, ఆయాసం, కండరాల నొప్పిని సాధ్యమైనంత తగ్గించుకొనేందుకు శరీరానికి ఎలక్ట్రోలైట్స్ తప్పనిసరి. అలాగే జీర్ణక్రియ సవ్యంగా సాగడానికి, ఫిట్‌గా ఉంచడంలో ఎలక్ట్రోలైట్స్ అత్యంత కీలకం. ఒకవేళ శరీరం డీహైడ్రేషన్‌కు గురైతే రకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

ఎంత తిన్నాం అనే దానికంటే సమతులాహారం తీసుకున్నామా లేదా అన్నది ముఖ్యం. దాని కోసం మెనూలో పండ్లు, కూరగాయలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. ఏది పడితే అది కాకుండా పోషకాహారంతో నిండిన డైట్ ప్లాన్ ఒకటి రూపొందించుకొని, దాన్ని ఆచరించాలి. ఏయే సమయాల్లో తినాలో కూడా అందులో ఉండాలి. కావాలనుకొంటే ఈ మెనూలో నచ్చిన వెరైటీలు కొన్ని చేర్చుకోవచ్చు.

మీ శరీరం, దాన్లో జరుగుతున్న మార్పులపై మీకు పూర్తి అవగాహన ఉండాలి. వ్యాధులు వచ్చాక మందు వేసే కంటే... ఆ వ్యాధులు దరి చేరకుండా చూసుకోవడం ఉత్తమం. అందుకే రెగ్యులర్‌గా మెడికల్ చెక్‌పలు చేయించుకోవాలి. క్రమం తప్పని వైద్య పరీక్షలు మీ జీవితాన్నే కాదు, మందుల ఖర్చు కూడా తగ్గిస్తాయని మర్చిపోవద్దు.

విరామం లేని పని గంటలు, ప్రయాణాలవల్ల చాలామంది నిద్రను నిర్లక్ష్యం చేస్తుంటారు. కంటి నిండా నిద్ర లేకపోతే శారీరకంగా, మానసికంగా ఒత్తిడికి గురవుతారు. ఇది అనారోగ్యానికి దారి తీస్తుంది. కనుక రాత్రిళ్లు ప్రశాంతమైన నిద్ర ఉండేలా చూసుకోండి. పడుకొనేముందు గాడ్జెట్లను దూరం పెట్టండి. ఇది మీకు ఎన్నో రకాల సమస్యల నుంచి ఉపశమనం ఇస్తుంది.





# టాప్‌లోకి దూసుకెళ్లిన విరాట్ కోహ్లీ

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్?లో టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అగ్రస్థానంలోకి దూసుకొచ్చాడు. ఒక స్థానం మెరుగుపర్చుకొని టాప్? ప్లేస్?కు చేరుకున్నాడు. ప్రస్తుతం విరాట్ 785 రేటింగ్స్?తో నెం.1 ర్యాంక్?లో ఉన్నాడు. గత నాలుగేళ్లలో వన్డే ర్యాంకింగ్స్?లో నెం.1 పొజిషన్?కు చేరుకోవడం విరాట్?కు ఇదే తొలిసారి. అతడు చివరిసారిగా 2021 జులైలో వన్డేల్లో నెం1 ర్యాంక్? సాధించాడు. న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ 784 రేటింగ్స్‌తో రెండు స్థానంలో ఉన్నాడు. టాప్?లో విరాట్‌కు, డారిల్ మిచెల్?కు ఒకే రేటింగ్ పాయింట్ తేడా ఉండడం గమనార్హం. ఇక స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ టాప్ నుంచి మూడో ప్లేస్‌కు పడిపోయాడు. గత కొన్నిరోజులుగా వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్ టాప్‌లో ఉన్నాడు. అయితే రీసెంట్‌గా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో రోహిత్ స్వల్ప స్కోర్‌కే ఔటయ్యాడు. అదే సమయంలో విరాట్ గత ఐదు వన్డే మ్యాచ్‌ల్లో 50ం స్కోర్లు సాధించాడు. దీంతో కోహ్లీ ఒక స్థానం మెరుగుపర్చుకోగా, రోహిత్? రెండు స్థానాలు దిగజారాడు. ప్రస్తుతం రోహిత్ శర్మ 775 రేటింగ్స్?తో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. BCCI Pగతేడాది సౌతాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో విరాట్ అత్యుత్తం ప్రదర్శన చేశాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో విరాట్ రెండు సెంచరీ, ఒక హాఫ్ సెంచరీ సహా 303 పరుగులు చేసి ఔరా అనిపించాడు. దీంతో అతడికి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్ దక్కింది. అంతకుముందు ఆస్ట్రేలియా సిరీస్‌లో మూడో మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ చేశాడు. ఇక ప్రస్తుతం కివీసతో జరుగుతున్న సిరీస్‌లోనూ తొలి మ్యాచ్‌లో విరాట్ 93 పరుగులతో రాణించాడు. తృటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. అలా విరాట్ ఆడిన ఆఖరి 5 వన్డేల్లో అన్నింట్లోనూ 50ం స్కోర్లు చేశాడు. బౌలింగ్ విభాగానికి వస్తే, టాప్ 5 స్థానాల్లో ఎలాంటి మార్పులు జరగలేదు. అఫ్గానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ టాప్?లోనే ఉన్నాడు. అతడు 710 రేటింగ్స్‌తో అగ్రస్థానంలో ఉండగా, ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ (670 రేటింగ్స్) రెండో ప్లేస్?లో ఉన్నాడు. ఈ లిస్ట్‌లో టీమ్ఇండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మూడో స్థానంలో ఉన్నాడు. కాగా, రాజ్‌కోట్ వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో వన్డేలో విరాట్ నిరాశ పర్చాడు. ఈ మ్యాచ్‌లో 29 బంతులు ఆడిన అతడు 23 పరుగులు చేసి ఔటయ్యాడు. ఇందులో 2 ఫోర్లు ఉన్నాయి. మరో స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ కూడా స్వల్ప స్కోర్‌కే పెవిలియన్ చేరాడు . అతడు 24 పరుగులు చేసి ఔటయ్యాడు.

# లీగ్ నుంచి తప్పుకున్న మొహమ్మద్ రిజ్వాన్

బిగ్ బాష్ లీగ్‌లో భాగంగా సిడ్నీ థండర్ వర్సెస్ మెల్బోర్న్ రెనెగేడ్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ హై డ్రామా చోటుచేసుకుంది. మెల్బోర్న్ తరపున ఆడుతున్న రిజ్వాన్, క్రీజులో సెట్ అయినప్పటికీ పరుగులు చేయడంలో తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో భారీ షాట్లు ఆడాల్సిన సమయంలో ఆయన సింగిల్స్‌కే పరిమితమయ్యాడు. రిజ్వాన్ 23 బంతుల్లో కేవలం 26 పరుగులు (2 ఫోర్లు, 1 సిక్సర్) మాత్రమే చేశాడు. ఆయన స్ట్రైక్ రేట్ కేవలం 113 దగ్గరే ఆగిపోవడంతో, స్కోరు బోర్డు వేగం మందగించింది. ఇన్నింగ్స్ 18 ఓవర్లు ముగిసే సమయానికి మెల్బోర్న్ జట్టు 154/5 స్కోరుతో ఉంది. ఇంకా కేవలం 12 బంతులు మాత్రమే మిగిలి ఉండటంతో, క్రీజులో పవర్ హిట్టర్లు ఉండాలని కెప్టెన్ విల్ సదర్లాండ్ భావించారు. డగౌట్ నుంచి సిగ్నల్ రావడంతో, రిజ్వాన్ ఎటువంటి గాయం లేకపోయినప్పటికీ మైదానాన్ని వీడాల్సి వచ్చింది. నిబంధనల ప్రకారం దీనిని 'రిటైర్డ్ అవుట్‌గా పరిగణిస్తారు. ఇలా బీబీఎల్ చరిత్రలో బలవంతంగా రిటైర్డ్ అవుట్ చేయబడిన మొదటి విదేశీ ఆటగాడిగా రిజ్వాన్ నిలిచాడు. రిజ్వాన్ స్థానంలో స్వయంగా కెప్టెన్ విల్ సదర్లాండ్ క్రీజులోకి వచ్చాడు. అయితే ఈ 'మాస్టర్ ప్లాన్ణ ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. సదర్లాండ్ ఎదుర్కొన్న మొదటి బంతికే రన్ అవుట్ అయి పెవిలియన్ చేరాడు. చివరి రెండు ఓవర్లలో రెనెగేడ్స్ జట్టు కేవలం 16 పరుగులు మాత్రమే జోడించగలిగింది. నిర్ణీత 20 ఓవర్లలో ఆ జట్టు 170 పరుగులు చేసింది. లక్ష్య ఛేధనలో సిడ్నీ థండర్ డీఎల్ఎస్ పద్ధతిలో విజయం సాధించింది. ఈ సీజన్‌లో మొహమ్మద్ రిజ్వాన్ ప్రదర్శన నిరాశాజనకంగా ఉంది. ఇప్పటివరకు ఆడిన 8 మ్యాచ్‌ల్లో ఆయన కేవలం 167 పరుగులు మాత్రమే చేశాడు. ఆయన ఓవరాల్ స్ట్రైక్ రేట్ 101 గా ఉండటం టీ20 ఫార్మాట్‌లో ఆందోళన కలిగించే అంశం. ఈ అవమానకర ఉదంతంతో పాకిస్థాన్ సెలెక్టర్లు రిజ్వాన్‌ను రాబోయే టీ20 వరల్డ్ కప్ జట్టులోకి తీసుకోవడంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆధునిక టీ20 క్రికెట్‌లో స్ట్రైక్ రేట్ అనేది ప్రాణవాయ-ువు వంటిది. ఎంతటి స్టార్ ప్లేయర్ అయినా వేగంగా ఆడకపోతే జట్టు నుంచి పక్కకు తప్పుకోవాల్సిందేనని రిజ్వాన్ ఉదంతం మరోసారి నిరూపించింది.

# రెండో వన్డేలో టీమిండియా ఓటమి

**కేఎల్ రాహుల్ సెంచరీ వృథ**

**రెండో వన్డేలో భారత్‌పై 7 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం**

**అద్భుత సెంచరీతో కివీస్‌ను గెలిపించిన డారిల్ మిచెల్ (131రి)**

**టీమిండియా తరఫున కేఎల్ రాహుల్ (112రి) శతకం వృథ**

**విఫలమైన రోహిత్, కోహ్లీ.. రాణించిన శుభ్‌మన్ గిల్ (56)**

**బౌలింగ్‌లో తేలిపోయిన భారత బౌలర్లు**



న్యూజిలాండ్ తో జరిగిన రెండో వన్డేలో భారత్ 7 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. డారిల్ మిచెల్ (117 బంతుల్లో 131 నాటౌట్) అద్భుత శతకంతో చెలరేగడంతో, టీమిండియా నిర్దేశించిన 285 పరుగుల లక్ష్యాన్ని కివీస్ సునాయాసంగా ఛేదించింది. కివీస్ 47.3 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. భారత జట్టులో కేఎల్ రాహుల్ (112 నాటౌట్) అజేయ సెంచరీ వృథ అయింది. రాజ్‌కోట్‌లోని నిరంజన్ షా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, కేఎల్ రాహుల్ శతకం, శుభ్‌మన్ గిల్ (56) అర్ధశతకంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (24), విరాట్ కోహ్లీ (23), శ్రేయస్ అయ్యర్ (8) వంటి కీలక బ్యాటర్లు విఫలం



కావడంతో భారీ స్కోరు సాధ్యం కాలేదు. న్యూజిలాండ్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 285 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్, 46 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కాస్త తడబడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన డారిల్ మిచెల్, విల్ యంగ్ (87)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 162 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను భారత్ నుంచి లాగేసుకున్నారు. విల్ యంగ్ ఔటయ్యాక, గ్లెన్ ఫిలిప్స్ (32 నాటౌట్)తో కలిసి మిచెల్ లాంఛనాన్ని పూర్తి చేశాడు. ఈ మ్యాచ్‌లో భారత బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. కివీస్ విజయంతో మూడు వన్డేల సిరీస్ 1-1తో సమం అయింది. ఇరు జట్ల మధ్య నిర్ణయాత్మక మూడో వన్డే జనవరి 18న ఇందోర్ లో జరగనుంది.

# ప్రపంచకప్ స్క్వాడ్‌లో రోహిత్, కోహ్లీలకు చోటు



భారత క్రికెట్ అభిమానులకు ఒక తీపి కబురు. టీమ్ ఇండియా దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల భవిష్యత్తుపై గత కొంతకాలంగా సాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. 2027లో దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచ కప్‌లో ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు పాల్గొంటారా లేదా అన్న సందేహాలపై టీమ్ ఇండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజ్‌కోట్‌లో న్యూజిలాండ్‌తో జరగనున్న రెండో వన్డేకు ముందు ఆయన మీడియాలో మాట్లాడుతూ, రోహిత్-కోహ్లీలు 2027 వరల్డ్ కప్ రోడ్‌మ్యాప్‌లో అంతర్భాగమని స్పష్టం చేశారు. "రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు కేవలం ఆటగాళ్లు మాత్రమే కాదు, వారు టీమ్ మేనేజ్‌మెంట్ వ్యూహాల్లో కీలక భాగస్వాములు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో వారు నిరంతరం వన్డే ఫార్మాట్ గురించి, ముఖ్యంగా దక్షిణాఫ్రికాలో జరిగే 2027 వరల్డ్ కప్ ప్రణాళికల గురించి చర్చిస్తున్నారు" అని కోటక్ వెల్లడించారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. గంభీర్ ఈ ఇద్దరు దిగ్గజాల మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ ఉందన్న వార్తల్లో నిజం లేదని, వారు అనుభవజ్ఞులైన ప్రొఫెషనల్స్ అని, జట్టును ఎలా ముందుకు తీసుకెళ్లాలో వారికి బాగా తెలుసని ఆయన పేర్కొన్నారు. 2027 వన్డే వరల్డ్ కప్ దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాల్లో జరగనుంది. దక్షిణాఫ్రికాలోని బౌన్సీ పిచ్‌లపై యువ ఆటగాళ్లు తడబడే అవకాశం ఉంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో కోహ్లీ, రోహిత్ వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉంటేనే భారత్ విజయావకాశాలు మెరుగుపడతాయని మాజీ క్రికెటర్లు సైతం అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం వారు ఆడుతున్న తీరు, చూపిస్తున్న ఫిట్‌నెస్ ప్రకారం 2027 వరకు వారు ఆడటం ఏమాత్రం కష్టం కాదని విశ్లేషకులు భావిస్తున్నారు. విరాట్ కోహ్లీ ప్రస్తుతం భీకరమైన ఫామ్‌లో ఉన్నాడు. గత ఐదు వన్డేల్లో వరుసగా 50 కంటే ఎక్కువ పరుగులు చేసి ప్రపంచ నంబర్ 1 ర్యాంకింగ్ సొంతం చేసుకున్నాడు. అటు రోహిత్ శర్మ కూడా వన్డేల్లో తన దూకుడును కొనసాగిస్తున్నాడు. టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత, వారిద్దరి పూర్తి ఫోకస్ ఇప్పుడు కేవలం వన్డే ఫార్మాట్‌పైనే ఉంది. ఇది జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్ అని కోచ్ అభిప్రాయపడ్డారు.

# ఆయుష్ బదోని ఎంపిక సరికాదు

**మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్**



న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు టీమిండియా స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయంతో దూరమవ్వగా.. అతని స్థానంలో ఢిల్లీ ప్లేయర్ ఆయుష్ బదోనిని సెలెక్టర్లు ఎంపిక చేశారు. అయితే ఈ ఎంపికను మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తప్పుబట్టాడు. ఇది సరైన ఎంపిక కాదని విమర్శించాడు. దేశవాళీ క్రికెట్‌లో అతని ప్రదర్శన మెరుగ్గా లేకున్నా..ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించాడు.'ఒకరి విషయంలో పరుగులు చేస్తేనే జట్టులో చోటు అంటున్నారు. మరొకరి విషయంలో మాత్రం పరుగులు చేయకున్నా జట్టులోకి తీసుకుంటున్నారు. ఐపీఎల్‌లో బదోని ఆడిన అద్భుత ఇన్నింగ్స్ ఏదైనా ఉంటే చెప్పండి. ఐపీఎల్ ప్రదర్శనను వన్డేలకు ప్రామాణికంగా తీసుకోకూడదు. అతను కేవలం మూడు వికెట్లు తీసుకున్నంత మాత్రాన ఆల్‌రౌండర్ అవుతాడా? అతను ఐపీఎల్‌లో ఎన్నిసార్లు బౌలింగ్ చేశాడు. అతను బౌలింగ్ చేయడం ఎవరైనా చూశారా?'అని క్రిష్ శ్రీకాంత్ సెలెక్టర్లను ప్రశ్నించాడు. రుతురాజ్ గైక్వాడ్ ఏం పాపం చేశాడని కూడా శ్రీకాంత్ నిలదీసాడు. 'గత వన్డే సిరీస్‌లో రుతురాజ్ గైక్వాడ్ సెంచరీ చేశాడు. కానీ అతన్ని ఎంపిక చేయలేదు. అతను ఏం తప్పు చేశాడు? ఒక వేళ ఆల్‌రౌండర్ అవసరమైతే అక్షర్ పటేల్‌ను తీసుకోవాల్సింది.'అని శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. లిస్ట్ ఏ క్రికెట్‌లో ఆయుష్ బదోని కనీసం 1000 పరుగులు కూడా చేయలేదని, అతని ఖాతాలో వికెట్లు కూడా ఎక్కువగా లేవని ఆకాశ్ చోప్రా విమర్శించాడు. నితీష్ కుమార్ రెడ్డిని జట్టులోకి తీసుకోని అవకాశాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించాడు. అతన్ని చివర్లో బ్యాటింగ్‌కు పంపించడం, కొన్ని ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేయించడం సరికాదన్నాడు. అయితే ఈ విమర్శలకు టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ సమాధానమిచ్చాడు. భారత్-ఏ తరఫున మెరుగైన ప్రదర్శన చేయడంతోనే బదోనిని తీసుకున్నామని స్పష్టం చేశాడు. ఐపీఎల్‌లోనూ అతను మెరుగ్గా రాణించాడని గుర్తు చేశాడు. బదోని జట్టులోకి వచ్చిన న్యూజిలాండ్‌తో రెండో వన్డేలో అతనికి అవకాశం దక్కలేదు. సుందర్ స్థానంలో నితీష్ రెడ్డిని ఆడించారు.

# సరికొత్త రికార్డ్ సృష్టించిన హర్మన్‌ప్రీత్

మహిళల ప్రీమియర్ లీగ్?లో ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హర్మన్?ప్రీత్ కౌర్ సరికొత్త రికార్డ్ సృష్టించింది. తాజాగా గుజరాత్ జెయింట్స్?తో జరిగిన మ్యాచ్?లో 193 పరుగుల భారీ ఛేదనలో అదిరే ఇన్నింగ్స్?తో హర్మన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్?' అవార్డు దక్కించుకుంది. 43 బంతుల్లోనే 71 పరుగులు చేసి జట్టును గెలిపించింది. ఈ క్రమంలోనే డబ్ల్యూపీఎల్?లో హర్మన్ అరుదైన రికార్డు తన పేరిట లిఖించుకుంది. ఆ రికార్డు ఏంటంటే? హర్మన్?ప్రీత్ ఈ ఎడిషన్?లో సూపర్ ఫామ్?లో దూసుకుపోతోంది. దీంతో మహిళల ప్రీమియర్ లీగ్ చరిత్రలో ఇప్పటికే అత్యధిక పరుగులు బాదిన భారత క్రికెటర్?గా నిలిచిన హర్మన్, తాజాగా మరో ఘనత సాధించింది. గుజరాత్?తో మ్యాచ్?లో సూపర్ ఇన్నింగ్స్?తో ఆమె డబ్ల్యూపీఎల్?లో 1000 పరుగులు మైలురాయి అందుకుంది. 55 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద హర్మన్ ఈ మైలురాయి అందుకుంది. దీంతో ఈ టోర్నీ హిస్టరీలో ఈ ఘనత సాధించిన భారత తొలి క్రికెటర్?గా హర్మన్ రికార్డులకెక్కింది. ఇక తాజా మ్యాచ్?లో హర్మన్ 71 పరుగులతో రాణించింది. ఈ క్రమంలోనే ఆమె మెగ్ లానింగ్, ఎల్లిస్ పెర్రీలను అధిగమించింది. ఓవరాల్?గా డబ్ల్యూరీపీఎల్?లో అత్యధిక పరుగులు బాదిన రెండో క్రికెటర్?గా హర్మన్ కొనసాగుతోంది. ఆమె ఇప్పటిదాకా 30 మ్యాచ్?ల్లో 46.18 సగటుతో 1016 పరుగులు చేసింది. ఇందులో 10 హాఫ్ సెంచరీలు నమోదు చేసింది. 95 పరుగులు అత్యధిక స్కోర్?గా ఉంది. ముంబయి జట్టుకే చెందిన నాట్? సీవర్?బ్రంట్ 1101 పరుగులతో ఈ లిస్ట్?లో టాప్?లో ఉంది. కాగా, ఈ సీజన్?లో అత్యధిక పరుగుల నమోదు చేసిన బ్యాటర్?గానూ హర్మన్ టాప్?లో కొనసాగుతోంది. ఇప్పటిదాకా మూడు మ్యాచ్?ల్లో ఆమె 165.00 యావరేజ్?తో 165 పరుగులు చేసింది. ఆర్సీబీతో ఆడిన తొలి మ్యాచ్?లో 20 పరుగులకే వెనుదిరిగిన ఆమె, తర్వాత వరుసగా 74 పరుగులు (ఢిల్లీ క్యాపిటల్స్), 71 పరుగులు (గుజరాత్?) రెండు భారీ హాఫ్ సెంచరీలు నమోదు చేసింది. ఈ లిస్ట్?లో తర్వాత స్థానాల్లో సోఫీ డివైన్ (141), అష్లీ గార్డ్?నర్ (134) ఉన్నారు. ఇప్పటిదాకా ప్రస్తుత ఎడిషన్?లో ఆరు మ్యాచ్?లు ముగిశాయి. ఇక మ్యాచ్?విషయానికొస్తే, గుజరాత్?పై ముంబయి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 193 భారీ ఛేదనలో హర్మన్?తోపాటు అమన్?జోత్ కౌర్ (40 పరుగులు, 26 బంతుల్లో), నికోల కెరీ (38 పరుగులు, 23 బంతుల్లో) రాణించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 192-5 భారీ స్కోర్ చేసింది. బెత్ మూనీ (33), కనికా అహూజా (35), జార్జి వేర్?హామ్ (43), భార్తి ఫుల్మాలి (36) ఆకట్టుకున్నారు.

# హాస్యం చుట్టూ తిరిగిన కథ అనగనగా ఒకరాజు

## సంక్రాంతికి నవ్వులు పండించిన నవీన్ పోలిశెట్టి



నేటి యువ కథానాయకుల్లో వినోదానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారు నవీన్ పొలిశెట్టి. ఈ సంక్రాంతికి అలాంటి వినోదాన్ని పంచడానికి 'అనగనగా ఒకరాజుఅంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. గౌరవపురం జమీందార్ గోపరాజు మనవడే రాజు (నవీన్ పొలిశెట్టి). వారసత్వంగా జమీందార్ మనవడు అనే పేరు తప్ప, తాత సంపాదించిన ఆస్తులేమీ మిగలకపోవడంతో ఆర్థిక కష్టాలతో సతమతమవుతూ, పగటి కలలు కంటూ గడుపుతుంటాడు. బాగా డబ్బున్న కుటుంబానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే జీవితంలో స్థిరపడిపోవచ్చనే నిర్ణయానికొస్తాడు. చారులత (మీనాక్షి చౌదరి)ని చూశాక ఆమే తన రాణి అయితే కష్టాలన్నీ గట్టెక్కేయొచ్చని భావించి, ఆమె మనసుని గెలచుకోవాలని రంగంలోకి దిగుతాడు. మరి చారులత మనసుని ఎలా గెలిచాడు?ఆమె జీవితంలోకి వచ్చాక రాజు కష్టాలు తొలగిపోయాయా? రాజు రాజకీయాల్లోకి అడుగు పెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? తదితర విషయాల్ని తెరపై హృద్యంగా చిత్రీకరించారు. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన ఒక ప్లలెటూరి కథ ఇది. కథ, కథనం, పాత్రలు... ఇలా ప్రతిదీ ఇదివరకటి సినిమాల్లో చూసిన అనుభూతినే కలిగిస్తాయి. అయినా సరే, రాజు పాత్ర చేసే హంగామా నవ్విస్తుంది. కథానాయకుడు నవీన్ పొలిశెట్టి తన మార్క్ టైమింగ్‌ని ప్రదర్శిస్తూ, వన్ మేన్ షోలా సినిమాని ముందుకు నడిపించాడు. సంభాషణలు ఈ సినిమాకి ప్రధానబలం. తన దగ్గరికి సాయం కోసం వచ్చే జనాల కష్టాల్ని వింటూ రాజు పడే అగచాట్లతో సినిమా ముందుకు సాగుతుంది. ఆ సన్నివేశాలన్నీ సాదాసీదాగా అనిపిస్తాయి. పెళ్లిలో శపథం, డబ్బున్న అమ్మాయిల కోసం రాజు చేసే ప్రయత్నాలు, ఆపరేషన్ చారులత ఎపిసోడ్స్ మొదలయ్యాకే అసలు సినిమా మొదలవుతుంది. భీమవరం బాల్మ, రాజుగారి పెళ్లిరో పాటలు సినిమాకి మరింత ఊపుని తీసుకొస్తాయి. ఆ రెండు పాటల చిత్రీకరణ కూడా ఆకట్టుకుంటుంది. చారులత మనసుని గెలిచేందుకు రాజు తన గ్యాంగ్‌తో కలిసి చేసే విన్యాసాలు బాగా నవ్విస్తాయి. విరామ సన్నివేశాలకు ముందు కథలో మలుపు ఆకట్టుకుంటుంది. ద్వితీయార్ధంలో కథ పూర్తిగా ఓ కొత్త మలుపుని తీసుకుంటూ, గ్రామ రాజకీయాల నేపథ్యాన్ని ఆవిష్కరిస్తుంది. ప్రథమార్ధంలో రాజు డబ్బు కోసం పెద్దింటి అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించినట్టే, ద్వితీయార్ధం కథలోనూ రాజు ఓ ఎత్తుగడ వేస్తాడు. అదే ఈ సినిమాకి కీలకం. ఎన్నికల ప్రచారం, ఊరి జనాన్ని నమ్మించేందుకు కథానాయకుడు పడే అగచాట్ల నేపథ్యం బాగా నవ్విస్తుంది. హీరో స్నేహితులు ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ, అది చూసి ఊరి జనాల ప్రతిస్పందన ఇలా సందర్భోచితంగా మంచి హాస్యం పండుతుంది. సోషల్ మీడియా క్యాంపెయిన్, ఎన్నికల హంగామా సాధారణంగానే అనిపించినా, పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. భార్యాభర్తల మధ్య సంభాషణలు ఒకింత సెంటిమెంట్‌ని పండిస్తాయి. కథ, కథనాల విషయంలో అంచనాలేమీ పెట్టుకోకుండా, సరదాగా కాలక్షేపాన్ని ఆశించి వెళ్లిన ప్రేక్షకులకు తప్పకుండా సంతృప్తినిస్తుందీ చిత్రం. నవీన్ పొలిశెట్టి వన్ మేన్ షోలా ఉ ంటుంది ఈ సినిమా. ప్రతీ సన్నివేశంలోనూ తెరపై కనిపిస్తూ, నాన్ స్టాప్‌గా సంభాషణలు చెబుతూ అల్లరి చేస్తుంటాడు. చారులత పాత్రలో మీనాక్షి చౌదరి ఆకట్టుకుంటుంది. ఆమెకి ఇందులో ప్రాధాన్యమున్న పాత్రే దక్కింది. ముఖ్యంగా ద్వితీ-యార్ధంలో ఎక్కువ సన్నివేశాల్లో కనిపించింది. హీరో గ్యాంగ్‌లో కనిపించే చమ్మక్ చంద్ర, మహేశ్, బుల్లిరాజుగా సుపరిచితమైన మాస్టర్ రేవంత్ అక్కడక్కడా నవ్వించారు. రావు రమేశ్ పాత్ర ఆకట్టుకుంటుంది. ప్రథమార్ధంలో ఓ కొత్త చిట్టి కనిపించి ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేసింది. మిక్కీ జె.మేయర్ పాటలు, నేపథ్య సంగీతంతో సినిమాపై గట్టి ప్రభావమే చూపించారు. కథ, కథనాల కంటే సంభాషణల రచనే ఈ సినిమాకి ప్రధానబలం. బలమైన కథ లేదనే విషయం బయట పడకుండా, హాస్యం పండించేందుకు రచయితలు ప్రయత్నించారు.

## నేనెందుకు క్షమాపణలు చెప్పాలి: మైలకా అరోరా

ఐటమ్ సాంగ్స్‌తోనే ప్రత్యేక క్రేజ్ సొంతం చేసుకున్నారు నటి మలైకా అరోరా. ఆమె చేసిన కొన్ని పాటలు సినిమాకే హైలైట్‌గా నిలిచాయి. గతేడాది కూడా రెండు పాటల్లో మలైకా మెరిశారు. కొందరు ఆమెను ఈ విషయంలో ట్రోల్ చేయగా.. తాజాగా ఆమె స్పందించారు. ఆ పాటల వల్ల తనకు శక్తి వస్తుందని తెలిపారు. తాను చేసిన ఐటమ్ సాంగ్స్ విషయంలో ఎవరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. 'నేను డ్యాన్స్ చేయడం ఎందుకు తగ్గించాలి. ఆ విషయంలో క్షమాపణలు ఎందుకు చెప్పాలి. ట్రోల్స్ ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. డ్యాన్స్ చేయడం గొప్ప విషయం. అదో కళ. నిజమైన గౌరవంతో దాన్ని ఆస్వాదించాలి. 52 ఏళ్ల వయసులో నేను ఇలాంటి పాటల్లో హుషారుగా డ్యాన్స్ చేయగలుగుతున్నానంటే అది నా అదృష్టం. నేను సరైన మార్గంలోనే ప్రయాణిస్తున్నాను. ఇలాంటి పాటలతో అలరించడం నాకు చాలా శక్తినిస్తుంది. నన్ను చూసి మరికొందరు మహిళలు ఇలా హుషారుగా ఉంటే నాకు దానికి మించిన ఆనందం మరొకటి ఉండదు' అని మలైకా అన్నారు. 'ఛల్ ఛయ్య ఛయ్య ఛయ్య'.. 'మున్నీ బద్నామ్ హుయీ'.. నుంచి 'అనార్కలీ డిస్కో చాలి' వరకూ ఎన్నో పాటల్లో మలైకా తన కిర్రాక్ డ్యాన్స్‌తో అభిమానులను అలరించారు. గతేడాది కూడా హనీ సింగ్‌తో కలిసి 'చిల్‌గమ్', ఆదిత్య సర్పోదర్ దర్శకత్వంలో వచ్చిన 'థామా'లో రష్మికతో కలిసి పాయిజన్ బేబీతో ఆకట్టుకున్నారు.



# మన శంకరవరప్రసాద్ కలెక్షన్ల దూకుడు

### రెండ్రోజులకే వందకోట్ల క్లబ్‌లో చేరిక.. కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్న దర్శకుడు



ఈ పండగకు అగ్ర హీరో చిరంజీవి శంకరవరప్రసాద్‌గా సందడి చేస్తూ విజయాన్ని సొంతం చేసుకున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఆయన నటించిన 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరి 12న ప్రేక్షకుల ముందుకువచ్చి ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరిస్తోంది. మొదటిరోజు రూ.84 కోట్లు వసూలు చేసిన ఈ సినిమా రెండో రోజూ కూడా బాక్సాఫీస్ వద్ద దూకుడు కొనసాగించింది. తాజాగా దీని రెండు రోజుల కలెక్షన్లను నిర్మాణసంస్థ అధికారికంగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా 48 గంటల్లో రూ.120 కోట్లు వసూలు చేసినట్లు తెలుపుతూ పోస్టర్ విడుదల చేసింది. ఈ సినిమా వంద కోట్లు దాటడంపై అనిల్ రావిపూడి ఆనందం వ్యక్తంచేశారు. వరుసగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన తన ఆరో చిత్రమిదని పేర్కొన్నారు. అసలు సంక్రాంతి ఇప్పటినుంచి మొదలవుతుందని అందరూ ఈ చిత్రాన్ని థియేటర్‌లో చూసి ఆనందించాలని కోరారు. తనకు ఇంతకుమించిన సంక్రాంతి గిఫ్ట్ మరొకటి ఉండదన్నారు. ఇక ప్రముఖ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మై షోలో గంటకు 24 వేల టికెట్స్ అమ్ముడవుతున్నాయని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఈ పండగకు బ్లాక్‌బస్టర్ హిట్ సొంతం చేసుకున్న చిత్రమిదని ప్రపంచవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తుందన్నారు. 'మన శంకరవరప్రసాద్ గారు' విజయం సాధించడంతో చిత్రబృందం తాజాగా సక్సెస్ మీట్ నిర్వహించింది. 25 రోజుల్లో స్క్రిప్ట్ పూర్తి చేసినట్లు అనిల్‌రావిపూడి తెలిపారు. ఛాలెంజ్‌గా తీసుకుని సినిమాను పూర్తి చేసినట్లు చెప్పారు. ఇక తన అంచనా ప్రకారం ఈ చిత్రానికి రూ.400 నుంచి 500 కోట్లు వస్తాయని నిర్మాత సాహు గారపాటి తెలిపారు. చిరంజీవి సరసన నయనతార నటించిన ఈ సినిమాలో వెంకటేశ్ అతిథి పాత్రలో సందడి చేశారు. 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాన్ని అందుకుంది. దీంతో చిత్రబృందం తాజాగా సెలబ్రేషన్స్ చేసుకుంది. దర్శకనిర్మాతలతో పాటు చిరంజీవి, వెంకటేశ్, రామ్ చరణ్ ఆ సెలబ్రేషన్స్‌లో పాల్గొని కేక్ కట్ సందడి చేశారు.

# పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విశ్వప్రసాద్‌తో పవన్ భేటీ

### తదుపరి ప్రాజెక్ట్ కోసమే అన్న ఊహాగానాలు

సంక్రాంతి పండుగ వేళ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందింది. భోగి పండుగ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, సరికొత్త ఆరంభాలకు నాంది పలుకుతూ పవన్ కళ్యాణ్ తన భవిష్యత్తు చిత్రాలపై దృష్టి సారించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టి.జి. విశ్వప్రసాద్‌తో పవన్ కళ్యాణ్ ఈరోజు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గతంలో వీరి మధ్య జరిగిన ప్రాథమిక చర్చలను ముందుకు తీసుకెళ్లే క్రమంలో రాబోయే భారీ ప్రాజెక్టుల గురించి ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' భాగస్వామ్యంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించబోయే చిత్రాలకు సంబంధించి ఈ చర్చలు జరిగినట్లు సమాచారం. రాజకీయ బాధ్యతలతో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, తన కోసం ఎదురుచూస్తున్న నిర్మాతలు, అభిమానుల కోసం తన సినీ కమిట్‌మెంట్లను వేగవంతం చేయాలని పవన్ భావిస్తున్నారు. ఈ భేటీతో పవన్ కళ్యాణ్ నెక్స్ట్ లైన్-అప్‌పై స్పష్టత రావడంతో మెగా ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరిన్ని వివరాలు త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.



# తుంబాడ్ దర్శకుడి మరో మూవీ మయసభ

తుంబాడ్' వంటి కల్ట్ క్లాసిక్‌ను అందించిన దర్శకుడు రాహి అనిల్ బార్వే నుంచి మరో సంచలనం రాబోతోంది. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం 'మయసభ'. ఈ సినిమా టీజర్‌ను తాజాగా విడుదల చేసింది చిత్రయూనిట్. 'తుంబాడ్' తరహాలోనే ఈ సినిమాలో కూడా ఒక విభిన్నమైన ప్రపంచాన్ని ఆవిష్కరించబోతున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా ఇందులో ప్రధాన పాత్రలో నటిస్తున్న జావేద్ జాఫ్రీ గతంలో ఎన్నడూ చూడని విధంగా ఒక కొత్త అవతారంలో కనిపిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచారు. వీణా జమ్కర్, దీపక్ దామ్లే, మొహమ్మద్ సమద్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఈ చిత్రం జనవరి 30న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463